MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి : 23 సంచిక: 11 రంగారెడ్డి జులై 2025 పేజీలు : 36 వెల : రూ. 10/-

25 ఏపిమాస్ రజతోత్సవ సంవత్సరం!

## 25 ఏళ్ళుగా సాగుతున్న మహాయజ్ఞం !



25 ఏళ్ళక్రితం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ను ప్రారంభిస్తున్న నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు ... మహిళా స్వయం సహాయ ఉద్యమ ప్రముఖులు



## అంతరిక్ష యాత్ర !



అంతర్జాతీయ అంతరిక్షకేంద్రంలో శుభాంశు శుక్లా



టైటాన్ స్పేస్ మిషన్‌లోస్థానం పొందిన జాహ్నవి



కలసి పనిచేయడానికి తెలంగాణా 'సెర్ప్',ఏపిమాస్ అవగాహన ఒప్పందం



ఆదర్శ సమాఖ్యలపై మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులకుహైదరాబాద్‌లో ఏపిమాస్ శిక్షణానంతరం గ్రూప్ ఫోటో

NABARD నాబార్డ్ సౌజన్యంతో ....

# భూమి, నీటి సంరక్షణ మరియు యాజమాన్యం

భూమిలో సారం ... మొలకకు ఆధారం

కీలక దశలో అందే నీరే పెరిగే పంటకు జీవం

## చేపట్టే పనులు

## నీటి సంరక్షణ - యాజమాన్యం

సూక్ష్మ సాగు - స్ప్రింక్లర్



సూక్ష్మ సాగు - బిందుసేద్యం



పంటకు జీవం
రెయిన్‌గన్



భూగర్భ నీటిని
పంచుకోవడం



ఆరు తడి
పంటలసాగు






సోలార్
పంపుసెట్ల ఏర్పాటు

## భూసార, నీటి సంరక్షణ

గ్రిడ్ లాక్ పద్ధతి






పొలాలలో నీటి కుంటలు
(ఫార్మ్ పాండ్)



చిన్న చిన్న
ఊట కుంటలు



రాతి కట్టలు

NABARD

# మహిళా సాధికారత

సంపుటి 23 సంచిక 11





సంపాదకీయం

## మహిళా సాధికారత ... పేదరిక నిర్మూలన !

**20**వ శతాబ్దం ప్రపంచ మానవాళికి అనేక మహోపకారాలను అందించింది. వాటిలో ముందుగా ప్రముఖంగా ప్రస్తావించవలసినది విశాల ప్రపంచాన్ని అరచేతిలో యిమిడిపోయేంతగా, ఖండఖండాంతర విశేషాలను క్షణాలలో తెలుసుకోగలిగేంతగా ఒక విస్ఫోటనంలా సాక్షాత్కరించిన సమాచార విప్లవం. మానవీయ దృక్పథంతో చూసినపుడు అంతకంటె మహోన్నతమైన, 'మహిళా స్వయంసహాయ మహోద్యమం' పేరిట ప్రఖ్యాతి గాంచిన ప్రపంచ 'పేదరిక నిర్మూలన' బృహద్ యజ్ఞం మరొకటి ! మన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2000 సంవత్సరం జూన్ 16 వ తేదీన నాటి, నేటి ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు నిరుపేదల జీవితాలలో వెలుగులు నింపాలన్న సత్సంకల్పంతో 'సెర్ప్' (సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ) ఆధ్వర్యంలో 'వెలుగు' ప్రాజెక్టును ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం ఆ వెలుగులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నలుదిక్కుల వ్యాపించడమే కాక, దేశమంతటా విస్తరించాయి. కాలక్రమేణ 'వెలుగు' 'ఇందిరా క్రాంతి పథం'గా పేరు మార్చుకున్నది. ఐతే, ఏ పేరుతో పిలిచినా మహిళా స్వయం సహాయం, మహిళా సాధికారత ప్రాతిపదికగా చేపట్టిన ఈ పేదరిక నిర్మూలన మహాయజ్ఞం 'ఇంతింతై వటుడింతై' అన్నట్టు నానాటికి మరింత బలోపేతమవుతూ, కోట్లాదిమంది పేదలు, పేదరికం నుంచి బయటపడడానికి మహోన్నత కృషి చేసింది. తెలుగువారిగా మనం గర్వించవలసిన విషయం ఏమిటంటే, ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన ఈ గ్రామీణ పేదరిక నిర్మూలన ప్రాజెక్ట్ అమలు తీరు మొత్తం దేశానికే ఆదర్శంగా నిలిచింది. వివిధ రాష్ట్రాలు ఈ ప్రాజెక్టు నిర్వహణలో సహాయ సహకారాల కోసం ఆంధ్రప్రదేశ్ వైపు చూసేవి. కీర్తిశేషులు శ్రీ యుగంధర్, డాక్టర్ పి. కోటయ్య, శ్రీ కొప్పుల రాజు, శ్రీ విజయకుమార్ వంటి హేమాహేమీలు అంకితభావంతో నిర్మించిన పునాది, సాగించిన నిర్విరామ కృషి ఫలితమిది! ఈ మహాయజ్ఞం విజయవంతంగా 25 వసంతాలను పూర్తి చేసుకున్నది. 2025 జూన్ 16వ తేదీన సెర్ప్ రజతోత్సవం జరుపుకున్నది. ఈ శుభ సందర్భంగా, ఈ విజయోత్సవానికి కారకులైన, ఈ విశిష్ట కృషిలో పాలుపంచుకున్న మహనీయులందరికి, మహిళలందరికి ఏపిమాస్ శుభాభినందనలు, శుభాకాంక్షలు తెలియజేస్తున్నది. నిజానికి యిది ప్రత్యేకంగా, ఏపిమాస్‌కు ఎంతో ఆనందదాయకమైన, గర్వకారణమైన విశేష సందర్భం! కారణం, తొలినాళ్ళలో, మలినాళ్ళలో సెర్ప్ వేసిన ప్రతి అడుగులో ఎంతో కొంత ఏపిమాస్ భాగస్వామ్యం వున్నది. వాస్తవానికి ఏపిమాస్ ఆవిర్భావమే స్వయంసహాయ ఉద్యమ నాణ్యతను పెంపొందించడానికి, మరింత బలోపేతం చేయడానికి. అందుకే, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సెర్ప్ ప్రారంభమైన సంవత్సర కాలంలోనే ఏపిమాస్ ఏర్పాటైంది. సెర్ప్‌తో ఏపిమాస్‌ది అవినాభావ సంబంధం, ఆత్మీయానుబంధం! అసంఖ్యాకంగా స్వయంసహాయ సంఘాల (డ్వాక్రా గ్రూపుల), సమాఖ్యల సభ్యులకు శిక్షణలు యిచ్చింది. కొందరు సెర్ప్ సిబ్బంది కూడా ఏపిమాస్ శిక్షణ పొందిన వారే! ఇతర రాష్ట్రాలలో స్వయంసహాయ ఉద్యమ బలోపేతానికి సెర్ప్ తరఫున శిక్షణ యివ్వగలిగే 'రిసోర్స్ పర్సన్స్' అనే నిపుణులను ఏపిమాస్ తయారుచేసింది. ఇలా ఎన్నెన్నో! ఉమ్మడి రాష్ట్రంగా వున్నా, రెండు తెలుగు రాష్ట్రాలు వచ్చినా, యిప్పటికీ సెర్ప్‌తో ఏపిమాస్ అనుబంధం, భాగస్వామ్యం, పేదరిక నిర్మూలన, మహిళా సాధికారత విశిష్ట కృషి కొనసాగుతూనే వున్నాయి. సెర్ప్ 25 ఏళ్ళు పూర్తిచేసుకుని రజతోత్సవం జరుపుకుని మున్ముందుకు సాగుతుంటే, 2001వ సంవత్సరం జులై 1న ఆవిర్భవించిన ఏపిమాస్ తన సేవా ప్రస్థానంలో ఫలప్రదంగా 24 సంవత్సరాలు పూర్తి చేసుకుని, 25వ వసంతంలోకి ప్రవేశిస్తూ, రజతోత్సవ ప్రాంగణాన అడుగిడుతున్నది. అచిరకాలం అనర్ఘ సేవలు అందించాలన్న మహదాశయంతో ముందుకు సాగుతున్న ఏపిమాస్ 2026 జులై 1న రజతోత్సవానికి, మరిన్ని విశిష్ట సేవలకు పునరంకితం కావడానికి సమాయత్తమవుతున్నది.


**Edited, Printed, Published and owned by T.Chandra Sekhar Reddy; Printed at Kala Jyothi Process Pvt Ltd, Plot No.CFC-1&2, Survey No.18, E-city, SEZ, General Industrial Park, Raviryal and Srinagar, Maheswaram, Ranga Reddy District, Telangana - 501359 and Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally, Manikonda,Ranga Reddy District,Telangana-500089. Editor:T.Chandra Sekhar Reddy**


**అయోమయంగా పరుగు పెట్టడం కంటె ఆత్మ విశ్వాసంతో ఒక్కో అడుగు వేసినా ఎంతో మేలే**

# మహిళా సాధికారత


ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. క్రిష్ణమూర్తి**

**ఎడిటోరియల్ కమిటి: ఎన్ వినాయక రెడ్డి, ఎల్. భవాని, ఆర్ రమాదేవి, ఎం. భార్గవి, జి. శ్రీనివాస్, కె శ్రీనివాస్, ఆర్ బ్రహ్మచారి**

**కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి , కన్సల్టెంట్ : కె. రఘురామరాజు**

**సమన్వయ సహకారం : పి. ఝాన్సీ లక్ష్మి , సాంకేతిక సహకారం : క్రిస్టాఫర్ వసంత్**


## లోపలి పేజీలలో ....


- 24సం।లు గడచి రజతోత్సవప్రాంగణంలో ఏపిమాస్ 05
- వరిలో తడి-పొడి ప్రక్రియతో నీటి ఆదా! 07
- సమాఖ్యలపై ఏపిమాస్ జాతీయస్థాయి శిక్షణ 09
- అంతరిక్షంలో నినదించిన 'భారత్‌మాతా కీ జై' 12
- అంతరిక్షంలోకి పాలకొల్లు అమ్మాయి ! 13
- పాడిరైతులకు 50శాతం రాయితీతో పశుదాణా 14
- కిసాన్ క్రెడిట్ కార్డు కోసం దరఖాస్తు ఎలా ? 15
- రైతన్నలకు 80 శాతం రాయితీతో డ్రోన్లు 16
- 68రోజుల్లోనే పంటచేతికి..ఏడాదికి 5 పంటలు 17
- సమగ్ర వ్యవసాయ కార్తెల పంచాంగం 18
- ఎస్‌హెచ్‌జి మహిళలకు రూ.లక్ష రుణం! 19
- రసాయనికఎరువులు మోతాదుమించితే ముప్పే 20
- చూపు లేని వారికి చుక్కానిలా మీరా బద్వే ! 22
- పసుపు పంటతో మన్యం మహిళ! 24
- మన్యం ముఖచిత్రాన్ని మార్చిన ఆగ్రోఫారెస్ట్రీ ! 25
- పుట్టగొడుగుల పెంపకంలో 6 దశలు 26
- బాటిల్ వాటర్ వ్యాపారాన్ని గుర్తించిన చౌహాన్ 28
- ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వ రాయితీలు 29
- ఒకే ఒక కషాయంతో కాళ్ళ వాపులు మాయం! 30
- ప్రసవానికి ముందటి శరీర పటుత్వం కోసం. 32
- ప్రసవం కోసం ఆసుపత్రికి వెళ్లేటప్పుడు 33
- ఏపీ రైతులకు సొసైటీలలో 23రకాల సేవలు 34


## 'మహిళాభివృద్ధి సొసైటీ' (ఏపిమాస్)

'**మ**హిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటిగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశంలోని ఇతర అనేక రాష్ట్రాలలో మహిళా స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతోపాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడంకోసం 'మహిళా సాధికారత 'పత్రికతోపాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.


| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్ళకు | : | రూ. 200 |
| మూడేళ్ళకు | : | రూ. 280 |

| ప్రకటన ఛార్జీలు | |
|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**



మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118
Web: www.apmas.org, E Mail: info@apmas.org


కలను కళ్ళలో దాచుకుంటే కరిగి కన్నీరవుతుంది, గుండెలో పొదువుకుంటే నెరవేర్చుకునే ప్రేరణ ఇస్తుంది

# 24 వసంతాలు గడచి,రజతోత్సవ ప్రాంగణంలో ఏపిమాస్ !

స్వయంసహాయ ఉద్యమానికి ప్రోత్సాహం అందించాలన్న లక్ష్యంతో 2021లో ఏర్పాటైన ఏపిమాస్ సంస్థ అంచెలంచెలుగా తన కార్యక్రమాలను, పరిధిని విస్తరించుకుంటూ ఇరవై నాలుగు వసంతాలు పూర్తి చేసుకొని, విజయపథంలో మరిన్ని ముందడుగులకు ప్రణాళికలు రూపొందించుకుంటూ, వచ్చే ఏడాది అంటే, 2026 జులై 1 వ తేదీన రజతోత్సవం జరుపుకోవడానికి సిద్ధమవుతున్నది.

2030 నాటికి 10 లక్షల అట్టడుగు వర్గాలకు చెందిన మహిళల, రైతుల, స్థానిక, సామాజిక వర్గాల నేతృత్వంలో వారి ఆర్థికస్థితిలో మార్పుకు తోడ్పడే విభిన్న రకాల సేవలందిస్తూ, స్వయం సమృద్ధి , స్వావలంబనతో పనిచేసే సంస్థల కొరకు సానుకూల జీవనోపాధుల ఏర్పాటుకు వెలుగునిచ్చే మార్గదర్శిగా ఏపిమాస్ మరింత శక్తిమంతం, బలోపేతం కావాలన్న ఆశయంతో ముమ్మర కృషి సాగిస్తున్నది.

తన ఆశయ సాధనలో ప్రతి సంవత్సరం కూడా ఒక నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ఏపిమాస్ అందరి మన్నలను పొందుతున్నది. ఇరవై నాల్గవ వార్షికోత్సవం సందర్భంగా, ఈ ఇరవై నాలుగేళ్ళలో ఏపిమాస్ చేపట్టిన అతి ముఖ్యమైన ఇరవై నాలుగు కార్యక్రమాలను పరిశీలిద్దాం.

1. నాబార్డు మాజీ అధ్యక్షులు డాక్టర్ పి.కోటయ్యు అధ్యక్షతన శ్రీ సి.ఎస్.రెడ్డి వ్యవస్థాపక సి ఇ ఓగా ఏపిమాస్ సంస్థకు 2001 సంవత్సరం జులై 1వ తేదీన ప్రాణప్రతిష్ట జరిగింది. ప్రధానంగా నాణ్యత మదింపు, నాణ్యత పెంపుదల, సామర్థ్యం పెంపుదల, పరిశోధన అనే నాలుగు రంగాలలో స్వయంసహాయ సంఘాలకు తోడ్పాటు అందించే తన కార్యక్రమాలను ప్రయోగాత్మకంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఆదిలాబాద్, కడప, ప్రకాశం జిల్లాలలో ప్రారంభించింది.
2. 'మహిళా సాధికారత' మాసపత్రికను 2002లో ప్రారంభించి ప్రతినెల క్రమం తప్పకుండా ప్రచురిస్తున్నది.
3. స్వయంసహాయ సంఘాల, సమాఖ్యలను మదింపు చేయడం కోసం 'గ్రేడ్స్' అనే సాధనాన్ని రూపొందించింది.
4. స్వయంసహాయ సమాఖ్యలపై జాతీయ స్థాయిలో ఒక కార్యశాలను మొదటిసారిగా 2003లో నిర్వహించింది.
5. ఆగాఖాన్ ఫౌండేషన్ తోడ్పాటుతో 2004లో జీవనోపాధుల కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది.
6. "ప్రభుత్వ – ప్రభుత్వేతర సంస్థల భాగస్వామ్యం" పై రాష్ట్రస్థాయి సమ్మేళనాన్ని నిర్వహించింది. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైనారు.
7. స్వయం సహాయ సంఘాల, సమాఖ్యల ప్రతినిధులతో రాష్ట్ర స్థాయి "సంప్రదింపుల వేదిక"ను ఏర్పాటు చేసింది.
8. మెప్మా , సెర్ప్ సంస్థలతో ఒప్పందం చేసుకొని, వెలుగు క్లస్టర్‌లలో సామర్థ్యం పెంపుదలకు తోడ్పడింది.
9. 2006లో ఏపిమాస్ కార్యక్రమాల ప్రగతిని జర్మనీకి చెందిన ప్రొఫెసర్ శ్రీ హాన్స్ డైటర్ సీబెల్‌తో అధ్యయనం చేయించి, ఏపిమాస్ విజన్‌ను (ఆశయాన్ని) "భారతదేశంలో స్వయం సహాయ ఉద్యమ సుస్థిరాభివృద్ధి"గా సవరించడం జరిగింది.
10. ఏపిమాస్ వ్యవస్థాపక సభ్యులు, గ్రామీణాభివృద్ధికి, పేదరిక నిర్మూలనకు ఎంతగానో కృషిచేసిన ఐ.ఎ.ఎస్. అధికారి కీర్తిశేషులు స్మరజిత్ రే జ్ఞాపకార్థం స్మారకోపన్యాస కార్యక్రమానికి శ్రీకారంచుట్టింది.
11. దేశవ్యాప్త స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో 'జాతీయ వేదికను'ఏర్పాటుచేసి సమన్వయ బాధ్యతను చేపట్టింది.
12. తన కార్యక్రమాలను ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాలకు విస్తరించింది. ఆగాఖాన్ ఫౌండేషన్

నిన్ను గుడ్డిగా నమ్మేవారికి, వారి నమ్మకం గుడ్డిదని నిరూపించడం తెలివైన పనేనా ?

తోడ్పాటుతో మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలలోను, మిషన్‌శక్తి తోడ్పాటుతో ఒడిసా రాష్ట్రంలోను, టాటా ట్రస్ట్ తోడ్పాటుతో ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాలలోను తన కార్యక్రమాలను విస్తరించింది.

13. ఏపిమాస్‌కు సొంత భవన నిర్మాణం కోసం ప్రణాళికా సంఘం 2009లో రూ. 5 కోట్లు మంజూరు చేసింది.

14. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదిలాబాదు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో ఆరు మెగా వాటర్‌షెడ్ పథకాలను ఏపిమాస్‌కు కేటాయించింది.

15. జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ పశ్చిమ బెంగాల్ సిబ్బందికి ఏపిమాస్ అనేక సామర్థ్యం పెంపుదల కార్యక్రమాలను అమలు పరిచింది.

16. జర్మనీకి చెందిన బిఎఫ్‌టిడబ్ల్యు సంస్థ తోడ్పాటుతో సమీకృత వ్యవసాయ విధానాలను ప్రోత్సహించడానికి చిత్తూరు, అనంతరపురం జిల్లాలలో 'జి4' ప్రాజెక్టును అమలు జరిపింది

17. జర్మనీకి చెందిన జిఐజడ్ సంస్థ తోడ్పాటుతో 'హరిత వినూత్న కేంద్రాల పథకం' క్రింద ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రైతు ఉత్పత్తిదారు సంఘాలను ఏర్పాటు చేసి 9000 కుటుంబాలకు ప్రత్యక్షంగాను 6000 కుటుంబాలకు పరోక్షంగాను వివిధ రకాల విలువ గొలుసు కార్యక్రమాలను చేపడుతున్నది.

18. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ 'కరువు ఉపశమన పథకం' 'లీడ్ సంస్థ'గా అనంతపురం జిల్లాలో పనిచేసింది.

19. 'అరబిందో ఫార్మా ' సంస్థ సహకారంతో పెయ్యల పాలెం, బోరబట్ల మొదలగు గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దే కృషిని చేపట్టింది.

20. అన్నమయ్యజిల్లాలోని కురబలకోట, వాల్మీకిపురం మండలాలలో లక్సంబర్గ్ కు చెందిన ఏ ఇ ఐ ఎన్ సంస్థ తోడ్పాటుతో 'పాడిపంటలు' కార్యక్రమాన్ని అమలుచేస్తున్నది.

21. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఉద్యానశాఖ ప్రోత్సాహంతో చిన్న, సన్నకారు రైతులతో 'రైతు ఉత్పత్తిదారు సంస్థ' లను (ఎఫ్ పి ఓలను) ఏర్పాటుచేసి పంట ఖర్చు తగ్గించి, వారి ఆదాయాలను పెంచే వివిధ కార్యక్రమాలను అమలు చేస్తున్నది.

22. ఎఫ్ పి ఓల సభ్యులు తమంత తాముగా ఎఫ్ పి ఓల గురించిన అవగాహన పెంచుకుని, తమ సంస్థలను బలోపేతం చేసుకుంటూ, తమ జీవనోపాధులను మెరుగుపరుచుకొని ఆదాయాలను పెంచుకోవడానికి వీలుగా పది అంశాలతో "స్వయం అభ్యసన" శిక్షణ కరదీపికలను ఏపిమాస్ రూపొందించింది. దేశంలోని చాలా ప్రాంతాలవారికి ఉపయోగపడేలా ఈ కరదీపిక లను తెలుగు భాషతో పాటు ఆంగ్లం, హిందీ భాషలలో కూడా తీసుకు వచ్చింది.

23. దేశంలోని ప్రతి రాష్ట్రమూ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఏపిమాస్ సేవలు అందుకున్నవే. ఇంతేకాకుండా అంతర్జాతీయ స్థాయిలో కూడా బంగ్లాదేశ్ , కెనడా, ఇథియోపియా, జర్మనీ, కెన్యా, మైన్మార్, థాయ్‌లాండ్, యునైటెడ్ కింగ్‌డమ్, వియత్నాం వంటి దేశాలకు కూడా ఏపిమాస్ తన సేవలను అందించింది. ఇంతే కాకుండా, ఆమెరికాలో నాన్ ప్రాఫిట్ ఆర్గనైజేషన్ గా ఏపిమాస్ నమోదు కావడం మరో విశేషం.

24. ఎఫ్ పి ఓలను స్వయంసమృద్ధ సంస్థలుగా, సభ్యులకు నాణ్యమైన సేవలను అందించే వ్యవస్థలుగా తీర్చిదిద్దడానికి కృషిచేస్తుండడంతో పాటు మరోవైపు ఎప్పటికప్పుడు అనేక కొత్త భాగస్వామ్యాలను ఏర్పాటు చేసుకుంటూ విభిన్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పి4 కార్యక్రమంలో భాగస్వామిగా పేదరిక సర్వే కార్యక్రమాలను నిర్వహిస్తున్నది.

ఇలా, అనేక వైవిధ్యభరిత కార్యక్రమాలతో ఏపిమాస్ తన సేవల నాణ్యతను, విస్తృతిని పెంచుకుంటూ, రజతోత్సవ సంవత్సరంలోకి అడుగుపెట్టింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో ఉత్తమ సేవా సంస్థగా ఖ్యాతిని సంపాదించుకున్న ఏపిమాస్ రజతోత్సవమే కాదు, స్వర్ణ, వజ్రోత్సవాలు జరుపుకోవాలని ఆశిద్దాం. ■

**సమస్యను చూసి భయపడితే అది రెట్టింపు భయపెడుతుంది, పట్టించుకోకపోతే పలాయనమవుతుంది**

# వరిలో తడి-పాడి ప్రక్రియతో 80 శాతం నీటి ఆదా!

– అమరేంద్ర

ప్రధాన ఆహారంగా వాడే వరి పంటను సాగు చేయడానికి ఎక్కువ మోతాదులో నీరు అవసరం. సాంప్రదాయ పద్ధతిలో కిలో బియ్యం ఉత్పత్తి చేయడానికి 3000–5000 లీటర్ల నీరు అవసరం అవుతుంది. ఇది ఇతర ఆహార ధాన్యాల ఉత్పత్తికి అయ్యే నీటి వినియోగం కంటే 2–3 రెట్లు అధికం. ఇది ఇలానే కొనసాగితే, కోటిన్నర నుంచి రెండు కోట్ల (15–20 మిలియన్) హెక్టార్ల వరి పొలాలు నీటి ఎద్దుటిని ఎదుర్కొనే అవకాశం వుందని అంచనా. కాబట్టి తక్కువ నీటితో ఎక్కువ ఉత్పాదకత సాధించాల్సిన అవసరం ఎంతైనా వుంది. తక్కువ నీటి వినియోగంతో దిగుబడులు తగ్గకుండా వరి పంటను సాగు చేయడానికి అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ (ఐ ఆర్ ఆర్ ఐ) వారు తడి–పొడి విధానాన్ని రూపకల్పన చేశారు.

**తడి–పొడి (ఆల్టర్నేట్ వెట్టింగ్ డ్రైయింగ్ –ఎ డబ్ల్యు డి)**

ఇది వరి సాగులో నీటి యాజమాన్యం కోసం వినియోగించే ఒక సాంకేతిక ప్రక్రియ. ఈ పద్ధతిలో వరి పొలంలో నీరు తగ్గినపుడు అవసరమైనంత వరకే నీరు పెట్టడం ద్వారా నీటిని ఆదా చేస్తారు. దీనివలన పంట దిగుబడి తగ్గకుండానే నీటిని ఆదా చేయవచ్చు.




**ఎ డబ్ల్యు డి అంటే ఏమిటి ?**

ఎ డబ్ల్యు డి అనేది వరి సాగులో నీటి యాజమాన్యం కోసం ఒక పద్ధతి. దీనిలో పొలంలో నీటి మట్టం క్రమంగా తగ్గుతూ వుంటే, వేరు మట్టం వరకు నీరు వుండేలా చేస్తారు, నీరు తగ్గితే, మళ్ళీ నీరు పెడతారు. ఇలా చేయడం వలన నీటిని 30 శాతం ఆదా చేయడంతో పాటు, పంట దిగుబడిని కూడా 10 శాతం పెంచవచ్చు.

**ఎ డబ్ల్యు డి పద్ధతి అమలు తీరు**

వరి నాట్లు వేసిన సుమారు 1– 2 వారాల తరువాత ఎ డబ్ల్యు డి పద్ధతిని పాటించాలి.

**1. పైపుల ఏర్పాటు:**

వరి పొలంలో ఎ డబ్ల్యు డి పద్ధతినిలో నీటి మట్టాన్ని పర్యవేక్షించడానికి పైపులను ఏర్పాటు చేయాలి. ఇది 15 సెం.మీ వ్యాసంతో 30 సెం.మీ పొడవు కలిగిన పీవీసీ పైపుకు సగభాగం (15 సెం.మీ) వదలి, మిగతా 15 సెం.మీ పైపుకు 2 సెం.మీ ఎడంతో రంధ్రాలు చేసుకోవాలి.

ఈ పైపును రంధ్రాలున్నంత వరకు ఒక గట్టుకు దగ్గరలో పొలంలో దించాలి. ఆ తరువాత పైపు లోపల మట్టిని అడుగు భాగం వరకు తీసివేయాలి. పైపు లోపలి నీటి మట్టం,

పొలంలో నీటి మట్టం ఒకే ఎత్తులో వుండేటట్లు జాగ్రత్త పడాలి. తద్వారా ఎఫ్ డబ్ల్యుటి లోపల నీటి స్థాయిని సులభంగా పర్యవేక్షించవచ్చు.

**2. నీటి మట్టాన్ని పర్యవేక్షించడం :**

ఎ డబ్ల్యు డి పైపు సహాయంతో పొలంలో నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి.

**3. పొలంలో నీరు తగ్గే వరకు వేచి చూడటం:**

నీటి మట్టం ఒక నిర్దిష్ట స్థాయికి చేరిన తర్వాత, పొలంలో నీరు వేరు వ్యవస్థ వరకు తగ్గేవరకు వేచి చూడాలి. తరువాత నీరు పెట్టాలి.

**4. మళ్ళీ నీరు పెట్టడం:**

పొలం పూర్తిగా ఎండిపోక ముందే మళ్ళీ నీరు పెట్టాలి. ఇలా క్రమంగా ఎ డబ్ల్యు డి పద్ధతిని అనుసరించడం వలన నీటిని ఆదా చేయవచ్చు.

**ఎ డబ్ల్యు డి ఉపయోగాలు**

**నీటి ఆదా :**

ఎ డబ్ల్యు డి పద్ధతిలో పంటకు అవసరమైన నీటి తడులు తగ్గడం వలన, నీటిని పొదుపుగా ఉపయోగించడం వలన 15–30 శాతం నీరు ఆదా అవుతుంది,

**దిగుబడి పెరుగుదల:**

ఎ డబ్ల్యు డి పద్ధతి వరి దుబ్బుల, కంకుల సంఖ్య పెరగడం వలన దిగుబడి 20 శాతం పెంచడానికి కూడా సహాయపడుతుంది.

**ఖర్చు తగ్గుదల:**

తక్కువ నీటిని ఉపయోగించడం వలన నీటి పారుదల ఖర్చులు తగ్గుతాయి.

**పర్యావరణానికి మేలు:**

ఎ డబ్ల్యు డి పద్ధతిలో నీటిని పొదుపుగా ఉపయోగించడం వలన, పర్యావరణానికి కూడా మేలు జరుగుతుంది.

**చీడలు తెగుళ్ళ యాజమాన్యం :**

బలిష్టమైన వేరు వ్యవస్థ, పంటకు గాలి, వెలుతురు బాగా సోకడం వలన చీడలు, తెగుళ్ళు తగ్గినట్టు గమనించడం జరిగింది. ■

# తెలంగాణలో స్వల్పంగా మాతృ మరణాల పెరుగుదల

**క**రోనా కాలంలో తెలంగాణ రాష్ట్రంలో మాతృ మరణాలు స్వల్పంగా పెరిగాయి. ప్రసవ సమయంలో ప్రతి లక్షమందిలో 50మంది మృత్యువాతపడ్డారు. మెటర్నల్ మోర్టలిటీ రేషియో(ఎంఎంఆర్)లో రాష్ట్రం ఐదో స్థానంలో, ఇన్ఫ్యాంట్ మోర్టలిటీ రేటు (ఐఎంఆర్) పరంగా తొమ్మిదో స్థానంలో నిలిచింది. ఈ మేరకు 2020–22కు సంబంధించి కేంద్రం శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (ఎస్ఆర్ఎస్) విడుదల చేసింది. ఎస్ఆర్ఎస్ బులెటిన్ 2018–20 ప్రకారం తెలంగాణలో మాతృ మరణాల సంఖ్య 45గా నమోదు కాగా, 2020–22లో అది 50కు పెరిగింది. ఎంఎంఆర్ జాతీయ సగటు 88గా నమోదైంది. ఎంఎంఆర్ అతి తక్కువగా నమోదవుతున్న రాష్ట్రాల జాబితాలో కేరళ అగ్రస్థానంలో నిలిచింది. అక్కడ ప్రతి లక్ష ప్రసవాలకు 18 మంది మృత్యువాత పడ్డారు.

ఐఎంఆర్ విషయంలో తెలంగాణ కాస్త మెరుగు పడింది. 2021లో రాష్ట్రంలో పుట్టిన ప్రతి వెయ్యి మంది శిశువుల్లో 20 మంది మృత్యువాత పడ్డారు. 2022 నాటికి ఆ సంఖ్య 18కు తగ్గింది. శిశుమరణాల జాతీయ సగటు 26గా నమోదైంది. కేరళలో శిశుమరణాల రేటు ప్రతి వెయ్యికి 12గా ఉంది. కాగా ఉత్తరాది రాష్ట్రాల్లో జాతీయ సగటు (88)కు మించి మాతృమరణాలు సంభవించాయి. ఆ రాష్ట్రాల్లో ఎంఎంఆర్ 120గా నమోదైనట్లు ఎస్ఆర్ఎస్ బులెటిన్ పేర్కొంది. దక్షిణాది రాష్ట్రాల్లో ఈ సగటు 42గా రికార్డు అయినట్లు వెల్లడించింది. దేశంలోనే అత్యధిక మాతృ మరణాలు మధ్యప్రదేశ్‌లో సంభవించాయి. అక్కడ ప్రతి లక్ష ప్రసవాల్లో 159 మంది మృత్యువాతపడ్డారు. అత్యధిక శిశుమరణాలు కూడా మధ్యప్రదేశ్‌లోనే నమోదయ్యాయి. అక్కడ పుట్టే ప్రతి వెయ్యిమంది శిశువుల్లో 40 మంది మృతి చెందారు. ■

# ఆదర్శ సమాఖ్యలపై ఏపిమాస్ జాతీయస్థాయి శిక్షణ

– జి.శ్రీనివాస్

ఆదర్శ స్వయం సహాయ సంఘాల సమాఖ్యలపై ఏపిమాస్ ఆధ్వర్యంలో 17-06-2025 నుండి 21-06-2025 వరకు ఐదురోజులపాటు జాతీయస్థాయి శిక్షణను ఏపిమాస్ నిర్వహించింది. హైదరాబాదులోని ఏపిమాస్ ప్రధాన కార్యాలయం శిక్షణ కేంద్రంలో నిర్వహించిన ఈ శిక్షణకు మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుండి రెండు స్వచ్ఛంద సంస్థలకు చెందిన 31 మంది అభ్యాసకులు పాల్గొన్నారు. ఐదు రోజుల శిక్షణ కార్యక్రమంలో నాలుగు




రోజుల పాటు శిక్షణ, ఒకరోజు తెలంగాణా రాష్ట్రం హన్మకొండ జిల్లాలోని భీమదేవరపల్లి మండలంలో క్షేత్ర సందర్శన ఏర్పాటు చేయటం జరిగింది. ఈ శిక్షణలో ముఖ్యంగా సమాఖ్యల పరిపాలన, నిర్వహణ అనే అంశాలపై సహభాగ శిక్షణ పద్ధతులతో వివరించటం జరిగింది.

**శిక్షణ ఉద్దేశాలు**

- సభ్యుల ఆధీనంలో నడిచే స్వయం సహాయ సంఘాలు (ఎస్ హెచ్ జి లు), గ్రామ సంఘాలు (వి ఓ లు), క్లస్టర్ స్థాయి సమాఖ్యలు (సిఎల్ ఎఫ్ / సిఎంఆర్‌సిలు) పటిష్టమైన పాలన, సంస్థ సక్రమ నిర్వహణ అవసరాన్ని అవగాహన కలిగించడం.
- సమాఖ్యల స్వరూప, స్వభావాలపై స్పష్టతను, సమర్థమైన నిర్వహణ, మంచి పాలనా విధానాలతో సమాఖ్యల సుస్థిరాభివృద్ధిపై అవసరమైన అవగాహనను అందించడం.
- ఆదర్శ స్వయం సహాయక సమాఖ్యలను ప్రత్యక్షంగా సందర్శించి వాటి పనితీరును చూసే అవకాశాన్ని కల్పించడం.

పైన పేర్కొన్న ఉద్దేశాల ప్రకారం శిక్షణ ప్రారంభం కార్యక్రమంలో శ్రీ జి. శ్రీనివాస్, శ్రీ మురళి జాజున అభ్యాసకుల పరిచయం, శిక్షణ నుండి ఆశిస్తున్న అంశాలు, శిక్షణ ఉద్దేశం గురించి తెలిపారు. ఏపిమాస్ చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు. అభ్యాసకులు వారి సంస్థలలో సంఘాల, సమాఖ్యల కోసం చేస్తున్న కార్యక్రమాలను, వారి అనుభవాలను పంచుకునే విధంగా వారితో మాట్లాడించారు.

**అంతర్జాతీయ సహకార సంస్థల సంవత్సరం**

ఏపిమాస్ సి ఈ ఓ, ఎం డి శ్రీ సి.యస్ రెడ్డి మన దేశంలో స్వయం సహాయ సంఘాల, సమాఖ్యల పనితీరు గురించి వారికి వివరించారు. సమాఖ్యలు చక్కగా పని చేయాలంటే మంచి నాయకత్వం ఉండి, సభ్యులు బాధ్యతతో పని చేయాలన్నారు. సంఘాలకు, సభ్యులకు సమాఖ్య అందించే సేవల గురించి తెలిపారు.

'సహకార సంస్థలు మెరుగైన ప్రపంచ నిర్మాణానికి తోడ్పడతాయి' అనే నినాధంతో ఐక్యరాజ్యసమితి 2025 సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంస్థల సంవత్సరంగా ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేస్తూ, స్థిరమైన అభివృద్ధిని సాధించడంలో, సామాజిక, ఆర్థిక పురోగతిని ప్రోత్సహించడంలో సహకార సంస్థల కీలక పాత్రపై అవగాహన పెంపొందించుకోవాలని, ఈ సంవత్సరం వివిధ




కార్యక్రమాలు, కార్యకలాపాల ద్వారా సహకార సంస్థల మద్దతును, వాటి సహకారానికి ఉన్న ప్రాధాన్యతను పెంపొందిస్తూ, వాటి అభివృద్ధిని ప్రోత్సహించేందుకు చర్యలు చేపడతారని తెలిపారు.

శ్రీ మురళి జాజున సమాఖ్య అంటే ఏమిటో వివరిస్తూ, మన దేశంలోని వివిధ రకాల సమాఖ్యల గురించి చర్చించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో సంఘాల, సమాఖ్యల ఏర్పాటు విధానాన్ని తెలియజేశారు.

సమాఖ్యల అవసరం, ఉపయోగం, సమావేశ నిర్వహణపై అవగాహన కల్పించారు. మహాసభ, పాలక వర్గం, పదాధికారుల వివిధ బాధ్యతలను, సమాఖ్య ఆర్థిక పట్టికలను అర్థం చేసుకోవటం ఎలా అనే విషయాన్ని వివరించారు.

ఏపిమాస్ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీమతి రామలక్ష్మి సంఘాలు, సమాఖ్యలు పాటించాల్సిన సహకార సూత్రాలు, పద్ధతులు, సహకార విలువల గురించి వివరించారు. సమాఖ్యల బలోపేతం కోసం ఈ సూత్రాలను ఏవిధంగా అమలుపర్చాలో తెలిపారు. సంఘాలలో, సమాఖ్యలలో అంతర్గత నియంత్రణ, ఆర్థికవిధానం, సభ్యుల జీవనోపాధులు, ఆర్థికాభివృద్ధి కోసం సమాఖ్యలు నిర్వహించ వలసిన పాత్ర అనే అంశాలను కూడా వివరించారు.

శ్రీ జి. శ్రీనివాస్ సమాఖ్యలో నాయకత్వం ప్రాధాన్యత, వివిధ రకాల నాయకత్వాలు, నాయకులకు ఉండాల్సిన లక్షణాలు, ఎన్నికల విధానం గురించి రోల్ ప్లే పద్ధతి ద్వారా వివరించారు. సమాఖ్యలో సభ్యుల, బోర్డు సభ్యుల, పదాధికారుల విధులు, బాధ్యతల గురించి వివరించారు. స్వయం నియంత్రణ ఉద్యమం అమలు, చేపట్టే కార్యక్రమాలను వివరించారు .

శిక్షణ కార్యక్రమంలో భాగంగా శ్రీ మురళి జాజున, శ్రీ శ్రీనివాస్, కుమారి అక్షయ నేతృత్వంలో అభ్యాసకులు అందరు ఒకరోజు క్షేత్ర సందర్శన కోసం హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని సంఘాలు, గ్రామ సంఘాలు, మండల సమాఖ్య సభ్యులు, ప్రతినిధులతో సమావేశమై సంఘాలు, సమాఖ్యల నిర్వహణ విధానంపై నేరుగా సభ్యులతో మాట్లాడి ఎన్నో కొత్త విషయాలపై అవగాహనను పెంపొందించుకున్నారు.

జిల్లా అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ వెంకటేశ్వర్లు, జిల్లా ప్రాజెక్ట్ అధికారి శ్రీ అనిల్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీ దేవానంద్, వారి సిబ్బందితో సమావేశమై ప్రాజెక్ట్ ద్వారా సంఘాలకు అందుతున్న సేవలు, వివిధ ప్రభుత్వ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు.

స్త్రీనిధి డిప్యూటి జనరల్ మేనేజర్ శ్రీ తోమల అనంత్ కిషోర్ తెలంగాణలో స్త్రీనిధి అమలు విధానం, స్త్రీనిధి ద్వారా సంఘాలకు అందిస్తున్న అప్పులు, వివిధ సేవలు, కార్యక్రమాల గురించి వివరించారు.

నీరు, పారిశుద్ధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత (వాష్), ఆరోగ్యం, సుపోషణ గురించి శ్రీ కె. శ్రీనివాస్, శ్రీమతి ఎల్ భవాని వివరించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో

**అనుబంధం అంటే ఒకరిపట్ల ఒకరికి వుండే ఆత్మీయతే కాని, దీర్ఘకాల పరిచయమో, ఇచ్చిపుచ్చుకోడమో కాదు**

స్వచ్ఛమైన త్రాగునీటి లభ్యత, మంచినీటి నిల్వ విధానాలు, పారిశుద్ధ్య సదుపాయాల అభివృద్ధి, వ్యక్తిగత పరిశుభ్రత వంటి అంశాలే చక్కని ఆరోగ్యానికి మూలాధారమని పేర్కొన్నారు.

ఆరోగ్య పరిరక్షణలో సమాజం పాత్ర, ప్రజలలో ఆరోగ్య చైతన్యం కలిగించడం, ప్రాథమిక వైద్య సేవల లభ్యతను మెరుగుపరచడం వంటి అంశాలను వారు వివరించారు. చిన్నపిల్లలు, గర్భిణులు, మాతృమూర్తులలో పోషకాహారం ప్రాముఖ్యత, మైక్రో న్యూట్రియంట్ లోపాల గురించి, అనారోగ్యానికి పోషకాహార లోపాలు ఎలా కారణం అవుతాయో వివరించారు.

శ్రీ మహేష్ అలగప్ప సంఘాలను, సమాఖ్యలను బలోపేతం చేయటంలో సిబ్బంది పాత్ర ప్రాముఖ్యత గురించి వివరించారు. పరిపాలన, ఆర్థిక అంశాలలో, చట్టపరమైన అంశాలలో, వ్యాపారపరమైన అంశాలలో సిబ్బంది విధులు, బాధ్యతల గురించి తెలిపారు.



శిక్షణ ఐదవ రోజున శ్రీమతి రామలక్ష్మి, శ్రీ మురళి జాజున, శ్రీ శ్రీనివాస్ అభ్యాసకులు క్షేత్ర సందర్శనలో నేర్చుకున్న విషయాలపై చర్చించి సందేహాలను నివృత్తి చేశారు . క్షేత్ర సందర్శనలో తాము నేర్చుకున్న విషయాలను అభ్యాసకులు ప్రదర్శన ద్వారా వివరించారు.

అభ్యాసకులు ఈ ఐదు రోజుల శిక్షణలో ఎలాంటి అంశాలు నేర్చుకున్నారో శ్రీ సి యస్ రెడ్డి, శ్రీమతి రామలక్ష్మి అడిగి తెలుసుకున్నారు.

శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా శ్రీ సి.ఎస్. రెడ్డి గారు అనేక సూచనలు చేశారు.

**ముఖ్య సూచనలు**

1. ఎస్ హెచ్ జి సమాఖ్యలు బలమైనవిగా ఉండాలి. మహిళా సాధికారతకు, ఆర్థికాభివృద్ధికి సమాఖ్యలు పటిష్టంగా వుండడం తప్పనిసరి .
2. ఎస్ హెచ్ జి లు, వి ఓ లు, సి ఎల్ ఎఫ్ లేదా సి ఎం ఆర్ సిలు రైతు ఉత్పత్తిదారుల సంస్థలతో (ఎఫ్ పి ఓ లతో) ఒప్పందాలు చేసుకొని, కలిసి పని చేయాలి. వ్యవసాయ రంగంలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం కోసం ఈ అనుసంధానం కీలకం
3. మహిళలను రైతులుగా గుర్తించాలి. వ్యవసాయంలో మహిళల పనిని అధికారికంగా గుర్తించి, వారికి రైతులుగా గుర్తింపు, వనరుల ప్రాప్తి, శిక్షణల అవకాశాలు కల్పించాల్సిన అవసరాన్ని దృష్టిలో పెట్టుకోవాలి.
4. సమాఖ్య స్థాయిలో బుక్ కీపింగ్, ఆడిటింగ్, రేటింగ్ విధానాలు, ఎన్నికలు వంటి సక్రమ నిర్వహణ పద్ధతులను పాటించాలి. ఇవి సంస్థల పారదర్శకతకు, మానవ వనరుల అభివృద్ధికి దోహదపడతాయి.
5. సంఘాలకు, సమాఖ్యలకు సమగ్ర దృష్టికోణం (హోలిస్టిక్ అప్రోచ్ ) అవసరం. కేవలం ఆర్థిక పరమైన అంశాలనే కాకుండా, ఆరోగ్యం, నీరు–పారిశుద్ధ్యం, హక్కులు, నిధులు, అర్హతలు వంటి అంశాలను కూడా క్షుణ్ణంగా చూడాలి. ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల దిశగా చర్యలు తీసుకోవాలి.

అనంతరం, అభ్యాసకులు మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమం చాలా చక్కగా జరిగినదని, తాము ఎన్నో కొత్త విషయాలను నేర్చుకున్నామని చెప్పి, శిక్షణ ఇచ్చిన రిసోర్స్ పర్సన్‌లకు, శిక్షణ ఏర్పాటు చేసిన ఏపిమాస్ సంస్థకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. చివరగా ఈ శిక్షణపై ఒక్కొక్కరిగా అభ్యాసకుల స్పందనను నమోదు చేయించి, వారికి సర్టిఫికేట్లు అందజేయడంతో ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం ఫలప్రదంగా ముగిసింది. ■

నవ్వించినా, ఏడ్పించినా గత స్మృతులు మనసును ఉత్తేజ పరుస్తూనే వుంటాయి

# అంతరిక్షంలో నినదించిన 'భారత్ మాతా కీ జై'!



**భా**రత అంతరిక్ష రంగంలో ఒక నూతన అధ్యాయం ఆరంభమైంది. భారత వాయుసేన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐ ఎస్ ఎస్) లోకి అడుగుపెట్టిన తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించారు. ఈ చారిత్రాత్మక సందర్భంలో ప్రధాని నరేంద్రమోదీ శుక్లాతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ సంభాషణలో భాగంగా శుక్లా 'భారత్ మాతా కీ జై' అని నినదించారు.

18 నిమిషాల పాటు సాగిన ఈ సంభాషణలో.. "ఎలా ఉన్నారు? అక్కడ పరిస్థితులు ఎలా ఉన్నాయి? ఐఎస్ఎస్ లోకి వెళ్లగానే ఏమనిపించింది?" అని మోదీ శుక్లాను ఆరా తీశారు.

తాను క్షేమంగా ఉన్నానని, ఐఎస్ఎస్ నుంచి చూసినప్పుడు భారత్ ఎంతో గొప్పగా, చాలా పెద్దగా కనిపించిందని శుక్లా చెప్పారు. మొదటిసారి బయటి నుంచి భూగోళాన్ని చూస్తే ఏ ఎల్లలూ లేవనిపించిందని, ఏకత్వ భావన కలిగిందని తెలిపారు. ఐఎస్ఎస్ లోకి అడుగుపెట్టిన తొలి భారతీయుడిగా శుక్లా చరిత్ర సృష్టించారు.

శుభాన్షుతో పాటు మరో ముగ్గురు వ్యోమగాములు ఈ నెల 25న అమెరికాలోని కెనడీ స్పేస్ సెంటర్ నుంచి స్పేస్ఎక్స్ వ్యోమనౌకలో ఐఎస్ఎస్‌కు వెళ్లారు. శుక్లా బృందం అక్కడ 14 రోజుల పాటు వివిధ అంశాలపై పరిశోధనలు చేయనుంది. 1984లో రాకేశ్ శర్మ తర్వాత అంతరిక్ష యానం చేసిన రెండో భారతీయ వ్యోమగామి శుక్లా.

**మోదీ, శుక్లా మధ్య సంభాషణ ఇలా..**

**మోదీ :** మీకు హృదయపూర్వక శుభాకాంక్షలు. మీరు మన జాతీయ పతాకాన్ని అంతరిక్షంలోకి తీసుకెళ్లిన క్షణం భారతీయులకు గర్వకారణం. ప్రతి భారతీయుడి ఉద్వేగం, అభిమానం, ఆశలకు ప్రతినిధిగా మీతో మాట్లాడుతున్నాను.

**శుక్లా :** అంతరిక్షంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించడం గర్వంగా ఉంది. మీతో పాటు 140 కోట్ల మంది భారతీయుల శుభాకాంక్షలకు ధన్యవాదాలు. భూమి నుంచి అంతరిక్షానికి సాగిన ప్రయాణం నా ఒక్కడిదే కాదు. యావత్ దేశానిది. నేను వ్యోమగామిని అవుతానని చిన్నప్పుడు ఎప్పుడూ అనుకోలేదు. మీ నాయకత్వంలో దేశం కలలు నెరవేరడానికి ఎన్నో అవకాశాలు లభిస్తున్నాయి.

**మోదీ :** మీరెలా ఉన్నారు? అక్కడి పరిస్థితులు ఎలా ఉన్నాయి?

**శుక్లా :** నేను బావున్నాను. నాకిదో కొత్త అనుభవం. ఐఎస్ఎస్‌లో గడిపేందుకు వీలుగా మేం ఏడాది పాటు శిక్షణ పొందాం. కానీ ఇక్కడికి వచ్చాక అంతా మారి పోయినట్లుంది. చిన్నపాటి విషయాలు కూడా పూర్తి భిన్నంగా ఉంటాయి. ఇక్కడ నిద్రపోవడం ఒక సవాల్. ఈ వాతావరణానికి అలవాటు పడడానికి కొంత సమయం పడుతుంది.

**మోదీ :** అక్కడ మీకెలాంటి అనుభూతి కలుగుతోంది?

**శుక్లా :** భారత్ ఎంతో గొప్పగా చాలా పెద్దగా కనిపించింది. నిజానికి మనం మ్యాప్‌లో చూసేదానికంటే చాలా చాలా పెద్దగా! ఇక మొదటిసారిగా బయటి నుంచి భూమిని చూసినప్పుడు రాష్ట్రాలు, దేశాలు, ఏ సరిహద్దులు లేవనిపించింది. ఏకత్వ భావన కలిగింది. పైనుంచి చూసినప్పుడు భిన్నత్వంలో ఏకత్వమనే ఆదర్శం ఎంత అర్థవంతమైనదో తెలిసింది.

**మోదీ :** మీ ప్రయాణ విశేషాలు చెప్పండి!

**శుక్లా :** కాసేపటి క్రితం... నేను కిటికీ నుంచి బయటకు చూస్తుంటే.... మేం హవాయి మీద నుంచి వెళుతున్నాం. రోజుకు 16 సార్లు సూర్యోదయాలు, సూర్యాస్తమయాలు చూస్తున్నాం. మన దేశం ఎంతో వేగంగా ముందుకు

# అంతరిక్షంలోకి పాలకొల్లు అమ్మాయి !

**అం**తరిక్షయానం అందరికీ సాధ్యమయ్యే పనికాదు..! అలాంటి అసాధ్యాన్ని మన తెలుగమ్మాయి సుసాధ్యం చేయబోతోంది. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన 23 ఏళ్ల దంగేటి జాహ్నవి.. అంతరిక్షంలో అడుగుపెట్టే అద్భుత అవకాశాన్ని దక్కించుకుంది. ఈ ఘనత సాధించిన తొలి భారతీయ మహిళగా నిలిచింది. అమెరికాకు చెందిన ప్రైవేటు అంతరిక్ష పరిశోధన సంస్థ టైటాన్ స్పేస్ ఇండస్ట్రీస్ (టీఎసఐ) చేపట్టిన టైటాన్ స్పేస్ మిషన్ కోసం వ్యోమగామి అభ్యర్థి (ఏఎససీఏఎన్)గా జాహ్నవి ఎంపికయ్యారు.



ఇప్పటివరకు భారత్‌లో జన్మించి, ఇక్కడే నివసిస్తున్న మహిళ.. నేరుగా అంతరిక్ష యానానికి ఎంపిక కాలేదు. అయితే.. టైటాన్ స్పేస్ ప్రతినిధులు పలుమార్లు నిర్వహించిన పరీక్షలన్నీ పూర్తి చేసిన జాహ్నవి ఈ స్పేస్ మిషన్‌కు అర్హత సాధించింది. టైటాన్ స్పేస్ రోదసీలో భారీ అంతరిక్ష కేంద్రాన్ని నిర్మించనుంది.

భవిష్యత్‌లో అంతరిక్ష ప్రయోగ, వాణిజ్య, పర్యాటక కేంద్రంగా దీన్ని తీర్చిదద్దనుంది. ఈ మిషన్‌లో భాగంగా తొలుత కొద్దిమంది అంతరిక్ష పరిశోధక వ్యోమగాములు, పర్యాటకులను అంతరిక్షంలోకి తీసుకెళ్లనుంది. 2029 మార్చిలో నిర్వహించబోయే మొదటి అంతరిక్ష యాత్ర బృందంలో భారత్ నుంచి జాహ్నవి పాల్గొననుంది. ఈ యాత్రలో భాగంగా ఆమె ఐదు గంటలపాటు అంతరిక్షంలో గడపనుంది. దీనికి ఎంపికైన అభ్యర్థులకు వచ్చే ఏడాది అమెరికాతోపాటు పలుదేశాల్లో మూడేళ్లపాటు శిక్షణ ఇస్తారు. ఈ మిషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో అధికారికంగా వెల్లడించనున్నారు.

**సాకారం దాల్చిన చందమామ కలలు :**

జాహ్నవి 2021లో నాసా నిర్వహించిన 'ఇంటర్నేషనల్ ఎయిర్ అండ్ స్పేస్ ప్రోగ్రామ్'కు భారత్ తరఫున ఎంపికై రికార్డు సృష్టించింది. ఈ సందర్భంగా జాహ్నవి మాట్లాడుతూ ... 'అమ్మ, నాన్న కువైట్‌లో ఉద్యోగం చేస్తున్నారు. నేను అమ్మమ్మ దగ్గరే పెరిగా. మా అమ్మమ్మ లీలావతి చందమామ కథలు చెప్పేది. దీంతో నేను అంతరిక్షంలోకి వెళ్లాలని కలలు కనేదాన్ని' అని తెలిపింది.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)

■

---

వెళుతోంది!

**మోదీ :** మీతో ఏ భారతీయ వంటకాలను తీసుకెళ్లారు? ఇతర దేశాలకు చెందిన తోటి వ్యోమగాములకు రుచి చూపించారా?

**శుక్లా :** మన గాజర్ కా హల్వా, మూంగ్ కా దాల్ హల్వా, మామిడిపళ్ల రసం తీసుకొచ్చాను. అందరం కలిసి తిన్నాం. వాళ్లకెంతో నచ్చాయి.

**మోదీ :** ఇవాళ, మీరు మన మాతృభూమికి దూరంగా ఉండొచ్చు. కానీ భారతీయుల హృదయాలకు చాలా దగ్గరగా ఉన్నారు. మీ పేరులో 'శుభ' ఉంది. మీ యాత్ర కొత్త శకానికి శుభారంభం'. భారత్ చేపట్టే మానవసహిత యాత్ర 'గగన్ యాన్'కు తొలి అడుగు. మీ తోటి వ్యోమగాములకు కూడా శుభాకాంక్షలు.

**శుక్లా :** మీ ప్రేమాభిమానాలకు ధన్యవాదాలు.

అమెరికాకు చెందిన యాక్సియం-4 మిషన్‌లో భాగంగా భారత వాయుసేనకు చెందిన శుభాంశు శుక్లా అంతరిక్షంలోకి వెళ్లారు. ఆయనతో పాటు అమెరికాకు చెందిన పెగ్గీ విట్సన్, పోలండ్‌కు చెందిన స్లావోస్జ్ ఉజ్నాన్స్‌కీ-విస్నీవ్స్కీ, హంగేరీకి చెందిన టిబర్ కపు ఈ బృందంలో ఉన్నారు.

■

# పాడి రైతులకు 50 శాతం రాయితీతో పశుదాణా!

**ఆం**ధ్రప్రదేశ్ ప్రభుత్వం పాడి రైతులకు శుభవార్త వినిపించింది. పాడి రైతుల కోసం ఏపీ ప్రభుత్వం కొత్త పథకం అమలు చేస్తోంది. పశుగ్రాసం కొరత అధిగమించడం సహా పాల దిగుబడి పెంచేందుకు.. 50 శాతం రాయితీపై పశువుల దాణాను రైతు సేవా కేంద్రాలు, పశువుల ఆస్పత్రుల ద్వారా అందిస్తున్నారు. అయితే ఇందుకు తెల్ల రేషన్ కార్డు కలిగిన సన్న, చిన్నకారు రైతులే అర్హులు.

పాడి రైతులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుభవార్త వినిపించింది. పాడి రైతులకు అండగా ఉండేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా గోకులం షెడ్లు నిర్మిస్తున్నారు. అలాగే పశువుల దాహం తీర్చేందుకు నీటి తొట్టెలు ఏర్పాటు చేస్తున్నారు. తాజాగా పశువుల దాణాను కూడా ఏపీ ప్రభుత్వం రాయితీపై అందిస్తోంది.

పశువులకు పశుగ్రాసం కొరత రాకుండా.. అలాగే పాల దిగుబడి తగ్గకూడదనే ఉద్దేశంతో ఏపీ ప్రభుత్వం 50 శాతం రాయితీతో పశువుల దాణాను అందిస్తోంది. అయితే ఇందుకు కొన్ని అర్హతలు, నియమ నిబంధనలను అమలు చేస్తోంది. తెల్లరేషన్ కార్డు కలిగిన పాడి రైతులకు మాత్రమే ఈ అవకాశం కల్పిస్తున్నారు.

మరోవైపు ప్రభుత్వం 50 కేజీల బస్తా చొప్పున సమీకృత దాణాను రాయితీపై అందిస్తోంది. 50 కిలోల బస్తా పశువుల దాణా విలువ రూ.1110. అయితే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 50 శాతం రాయితీపై బస్తాను రూ.555లకే పాడి రైతులకు అందజేస్తోంది. రెండు ఆవులు లేదా గేదెలు, ఒక దూడకు 50 కిలోల బస్తా చొప్పున అందిస్తున్నారు. మొత్తంగా మూడు బస్తాలను ఒకసారి అందిస్తున్నారు. అంటే ఒకసారి 150 కిలోల పశువుల దాణాను రాయితీపై అందిస్తున్నారు.

మూడు విడతలుగా 450 కిలోల పశువుల దాణా 50 శాతం రాయితీపై అందించనున్నారు. తెల్లరేషన్ కార్డు కలిగిన సన్న, చిన్నకారు రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఇందుకోసం రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని చెబుతున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ నిష్పత్తి ఆధారంగా పశువుల దాణా కేటాయించనున్నారు.

మరోవైపు 20 శాతం ప్రోటీన్ కలిగిన ఈ పశువుల దాణాను ప్రభుత్వం తొలిసారిగా రాయితీపై అందిస్తోంది. రైతు సేవా కేంద్రాలతో పాటుగా, పశు వైద్యశాలల ద్వారా కూడా పంపిణీ చేస్తున్నారు. ఈ నిర్ణయం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 21 లక్షల మంది పాడి రైతులకు లబ్ధి చేకూరనుంది. ఇందుకోసం ప్రభుత్వం 69 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోంది.

మొత్తంగా 31,067 టన్నుల దాణా పంపిణీకి ఏపీ పశు సంవర్ధక శాఖ చర్యలు తీసుకుంది. పశుగ్రాసం కొరతను అధిగమించటంతో పాటుగా నిలకడగా పాల దిగుబడి పొందేందుకు, పశువుల విక్రయాలను నిలువరించే లక్ష్యంతో ఈ చర్యలు తీసుకుంటోంది. అర్హత కలిగిన పాడి రైతులు ఈ అవకాశం ఉపయోగించుకోవాలని ఏపీ పశు సంవర్ధక శాఖ అధికారులు సూచిస్తున్నారు. ■

## కోళ్లఫాం నిర్మాణాలకు ప్రోత్సాహం

రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో కోళ్లఫాం రైతులకు మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఫీజుల్లో రాయితీ కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పట్టణాల్లో నిర్మించే కోళ్లఫాంలకు స్థానిక సంస్థలకు చెల్లించాల్సిన డెవలప్ మెంట్ ఫీజులు, బెటర్‌మెంట్‌చార్జీల్లో పూర్తి మినహాయింపు యిస్తూ మున్సిపల్‌శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. లైసెన్స్ ఫీజులను గ్రామీణ ప్రాంతాల తరహాల్లో నిర్ణయిస్తూ ఆదేశాలిచ్చింది.

# కిసాన్ క్రెడిట్ కార్డు కోసం దరఖాస్తు ఎలా ?

**కేం**ద్రంలోని మోడీ ప్రభుత్వం రైతుల కోసం అనేక పథకాలను అందుబాటులోకి తెస్తోంది. ఇప్పటికే పీఎం కిసాన్ యోజన ద్వారా రైతులకు నేరుగా ఎకౌంట్లో ప్రతి సంవత్సరం 6000 రూపాయలు జమ చేస్తుంది. దీంతోపాటు రైతుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభించింది. రైతుల కోసం బీమా పథకం కూడా అందుబాటులో ఉంది.

దీంతో పాటు రైతులకు ఆర్థికంగా తోడ్పాటు అందించేందుకు దాదాపు 5 లక్షల రూపాయల వరకు రుణాన్ని అందించే స్కీం అందుబాటులోకి తెచ్చింది. అదే కిసాన్ క్రెడిట్ కార్డ్ స్కీమ్. కిసాన్ క్రెడిట్ కార్డు సేవలను రూ. 3 లక్షల రుణ పరిమితి నుంచి రూ. 5 లక్షల రుణ పరిమితికి పెంచబోతోంది. ఈ నేపథ్యంలో కిసాన్ క్రెడిట్ కార్డు కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలో ఇప్పుడు మనం తెలుసుకుందాం. .

రైతులకు వ్యవసాయం చేయడానికి డబ్బులు లేకపోతే, కిసాన్ క్రెడిట్ కార్డ్ ఉపయోగించవచ్చు. ఈ కార్డుపై రైతులకు కేవలం 4 శాతం వడ్డీ రేటుతో రుణం లభిస్తుంది. పశు పెంపకందారులు, మత్స్యకారులు కూడా కిసాన్ క్రెడిట్ కార్డ్ ప్రయోజనాలను పొందవచ్చు.

ఈ పథకాన్ని 1998లో భారత ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్ బి ఐ), నాబార్డ్ సంయుక్తంగా ప్రారంభించాయి. దీనిని 'కిసాన్ క్రెడిట్ కార్డ్ 'అని పిలుస్తారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి, కిసాన్ క్రెడిట్ కార్డ్ (కె సి సి) ద్వారా వ్యవసాయ రుణానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పథకం కింద, రైతులు రుణాన్ని కేవలం 4 శాతం వార్షిక వడ్డీ రేటుతో పొందవచ్చు.

**కావాల్సిన పత్రాలు ఇవే..**

కె సి సి కోసం, పాస్‌పోర్ట్ సైజు ఫోటో, ఆధార్ కార్డ్, ఓటరు ఐడీ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, రైతు భూమి పట్టా అవసరం అవుతాయి.

**ఆన్‌లైన్‌లో ఇలా దరఖాస్తు చేసుకోవాలి**

- మీకు నచ్చిన బ్యాంకు వెబ్‌సైట్‌ను సందర్శించండి.
- హోమ్ పేజీలో మీకు కిసాన్ క్రెడిట్ కార్డ్ కనిపిస్తుంది.
- మీరు కిసాన్ క్రెడిట్ కార్డ్ పై క్లిక్ చేసిన వెంటనే, దరఖాస్తు ఎంపిక విధానం కనిపిస్తుంది.
- మీరు క్లిక్ చేసిన వెంటనే, మీకు కొత్త పేజీ కనిపిస్తుంది.
- మీ అన్ని వివరాలను పూరించి సబ్మిట్ పై క్లిక్ చేయండి.
- దీని తర్వాత మీకు అప్లికేషన్ రిఫరెన్స్ నంబర్ కనిపిస్తుంది.
- మీరు అర్హులైతే, బ్యాంక్ 5 రోజుల్లోపు మిమ్మల్ని సంప్రదిస్తుంది.

■

## అల్లనేరేడు సాగుతో మంచి లాభాలు!

**ఒ**కటి కాదు, రెండు కాదు.. 25 సంవత్సరాలు ఉద్యాన సాగు చేశారు. భారీ స్థాయిలో నష్టాలు చవి చూశారు. రోజు కూలీగా మారాడు. మార్కెట్లో రైతుల నాడీ పసిగట్టాడు. మిత్రుల సలహాలు, సూచనలతో తనకున్న మూడెకరాల్లో అల్లనేరేడు సాగు చేశారు. ఒక్కసారి పెట్టుబడి పెట్టాడు. 4 సంవత్సరాలు వాటికి కావాల్సిన పోషకాలందించాడు. వీరి బ్రతుకుదెరువుకు ఆ మొక్కలే ఆర్థికంగా నిలిస్తున్నాయి. మంచి లాభాలొస్తున్నాయని రైతన్న హర్షం వ్యక్తం చేశారు.

ప్రస్తుతం అల్లనేరేడు మార్కెట్లో కిలో రూ. 150 నుండి రూ. 200 వరకు పలుకుతున్నదన్నారు. ఆయుర్వేద ఔషధాల గని అల్లనేరేడు. తీపి, ఒగరు, పులుపు రుచుల మిశ్రమాలతో కూడిన ఈ పండ్లను ఇష్టపడని వారుండరు. మార్కెట్లో ఎంత ధర ఉన్నా తినక మానరు. అంతటి డిమాండు ఉన్న అల్లనేరేడు మొక్కలను సాగుచేసే రైతులు జాగ్రత్తగా కాపాడుకుంటున్నారు.

(లోకల్ 18 సౌజన్యంతో)

■

వెన్ను చరచి ప్రోత్సహించే వారెవరూ లేకుంటే నీకు నీవే స్ఫూర్తి ప్రదాతవు కావాలి

# రైతన్నలకు 80 శాతం రాయితీతో డ్రోన్లు

మహిళల ఆర్థిక స్వావలంబన కోసం కేంద్ర ప్రభుత్వం "నమో డ్రోన్ దీదీ" పథకం కింద 80 శాతం రాయితీతో డ్రోన్లు అందిస్తోంది. సమాజంలో చురుగ్గా పని చేసిన మహిళలను ఎంపిక చేసి, వారిద్వారా డ్రోన్ టెక్నాలజీని దేశవ్యాప్తంగా ప్రాచుర్యంలోకి తీసుకురావడంలో భాగంగా వీటిని అందుబాటులోకి తీసుకొచ్చింది.

తక్కువ సమయంలో ఎక్కువ ఎకరాల్లో పురుగు మందులు పిచికారి చేసేందుకు ఈ డ్రోన్లు ఉపయోగపడు తున్నాయి. దేశవ్యాప్తంగా 14 వేలమంది మహిళలను ఈ పథకం కిందకు తేవాలని లక్ష్యం.

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నమో డ్రోన్ దీదీ పథకం కింద ఒక్కో సహాయ సంఘానికి గరిష్ఠంగా 8 లక్షల రూపాయల వరకూ కేంద్ర ప్రభుత్వం సాయం అందిస్తోంది.

వ్యవసాయరంగంలో పురుగు మందుల పిచికారీ కోసం డ్రోన్లను ఉపయోగించేలా మహిళా సంఘాలను తీర్చిదిద్దాలని కేంద్ర వ్యవసాయశాఖ నిర్ణయించిన విషయం తెలిసిందే. 2024–25 నుంచి 2025–26వ ఆర్థిక సంవత్సరం వరకు ఈ పథకం కింద 14వేల 500 మహిళాస్వయం సహాయక సంఘాలకు డ్రోన్లు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఈ దిశగా అన్నదాతలను ప్రోత్సహించడానికి రాష్ట్రానికి 875 యూనిట్లు మంజూరు చేసింది. ఐదుగురు రైతుల గ్రూపును లబ్ధిదారులుగా గుర్తించింది.

జిల్లాల వారీగా ఎంపిక పూర్తి చేసి వ్యవసాయ శాఖతో వారికి శిక్షణ ఇప్పించింది. ప్రతి గ్రూపు నుంచి ఒకరి చొప్పున 875 మందికి డ్రోన్ పైలట్ శిక్షణ ఇచ్చారు. వాటితో అన్న దాతలు ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేసేలా చర్యలు తీసుకుంటోంది. సాగుకు సాంకేతికతను జోడిస్తే ఖర్చులు ఆదా అవుతాయని, సేద్యం లాభసాటిగా మారు తుందనిఈ ఏడాది ప్రభుత్వం జిల్లాల వారీగా పరిమితంగా రైతు గ్రూపులకు డ్రోన్లు అందించింది.

**రూ.8 లక్షల రాయితీతో**

ఒక్కో యూనిట్ ధర రూ.9.80 లక్షలు. ఇందులో రైతుల వాటా రూ.1.96 లక్షలు. మిగిలిన రూ.8 లక్షలు ప్రభుత్వమే భరిస్తుంది. రైతుల వాటాను బ్యాంకుల ద్వారా రుణమిప్పించి డ్రోన్ కంపెనీలకు చెల్లించేలా చర్యలు తీసుకుంది.

**ఏడు నిమిషాల్లో ఎకరం**

ఒక ఎకరంలో పురుగుమందు పిచికారీ చేయడానికి డ్రోన్‌కు పట్టే సమయం ఏడు నిమిషాలే అని నిపుణులు తెలిపారు. అదే రైతు భుజానికి ట్యాంకు తగిలించుకుని స్ప్రే చేయాలంటే సుమారు రెండు గంటలకు పైగా పడుతుందని వివరించారు. 12 లీటర్ల నీళ్లతో డ్రోన్ ఎకరా పంటకు స్ప్రే చేస్తుంది. అదే మనుషులతో అయితే 100 లీటర్ల దాకా పడుతుందని తెలుపుతున్నారు.

డ్రోన్ నేరుగా మొక్క మీదకు స్ప్రే చేస్తుందని, దీనివల్ల మందు వృథా కాదని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొన్నారు. మనుషులు చల్లితే వృథా ఎక్కువగా ఉంటుందని, డ్రోన్‌తో మందు పిచికారీ చేస్తే ఎకరాకు 350 రూపాయలు వసూలు చేస్తారన్నారు.

అదే మనుషులైతే ఇద్దరు కూలీలు అవసరమవుతారని, రైతులకు ఇచ్చే డ్రోన్ 12 లీటర్ల ట్యాంకుతో కలిపి దాని బరువు 29 కేజీలు ఉంటుందన్నారు. ఈ డ్రోన్‌తో రోజుకు 10 ఎకరాల్లో మందు పిచికారీ చేయగలదని వివరించారు.

**ఆరోగ్య సమస్యలకు చెక్**

డ్రోన్‌తో మందులు స్ప్రే చేయిస్తే ఆరోగ్య సమస్యలు రావు. మనుషులు చల్లితే వారి ముక్కు, నోట్లోకి మందు వెళ్లి దీర్ఘకాలంలో పలు వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉంది. ఊపిరితిత్తులు, శ్వాసకోశ, జీర్ణాశయ వ్యాధులు సోకే అవకాశం ఉంది.

■

**నీ శక్తిని నీవే నమ్మకుంటే ఎలా? నమ్ము ... నీకంటె సాహసి, వివేకి, సమర్థుడు మరొకరు లేరు**

# 68 రోజుల్లోనే పంట చేతికి ... ఏడాదికి 5 పంటలు!

మారిన లైఫ్ స్టైల్, ఆహారపు అలవాట్ల కారణంగా ఎదురవుతున్న అనేక సమస్యలకు సంపూర్ణ పోషక విలువలు ఉండే చిరుధాన్యాలు (మిల్లెట్స్) పరిష్కార మార్గంగా మారాయి. క్రమేణా మిల్లెట్ల వినియోగం పెరుగుతుండటంతో రాగులు, సజ్జలు, జొన్నలు, కొర్రలు, ఊదలు, సామలు, అరికెలను మరింతగా వినియోగంలోకి తెచ్చేందుకు విస్తృతంగా పరిశోధనలు జరుగుతున్నాయి. ఇక్రిశాట్ (అంతర్జాతీయ మెట్ట ప్రాంతాల పంటల పరిశోధన సంస్థ) రాగులపై పరిశోధనలు చేసి, 'ర్యాపిడ్ రాగి' అనే పేరుతో ఓ సరికొత్త వంగడాన్ని అభివృద్ధి చేసింది.

శనగలు, కందుల తర్వాత స్పీడ్ బ్రీడింగ్ విధానంలో సైంటిస్టు నాలుగేళ్ల వ్యవధిలోనే దీన్ని తయారు చేశారు. సాంప్రదాయిక రకాల కంటే ఎన్నో రెట్లు మేలైనదిగా గుర్తింపు పొందిన ఈ రకాన్ని తాజాగా ఇక్రిశాట్ విడుదల చేసింది.

ప్రయోజనాలెన్నో : దేశంలో జొన్న, సజ్జల తర్వాత మూడో అత్యంత ముఖ్యమైన చిరుధాన్యంగా రాగి పంట గుర్తింపు పొందింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో లక్ష ఎకరాల్లో, తెలంగాణలో 13 వేల ఎకరాల్లో సాగవుతోంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్నటువంటి వంగడాలతో పంట కాలం 135 రోజులుగా ఉండటంతో ఏడాదికి 2 పంటలు మాత్రమే సాధ్యమవుతున్నాయి.

- ఇక్రిశాట్ కొత్త వంగడం 'ర్యాపిడ్ రాగి' పంట 68 రోజుల్లోనే చేతికొస్తుంది.
- దీంతో ఏడాదిలో 5 పంటలను పండించవచ్చు.
- విత్తనం వేసిన తర్వాత సత్వరమే అది మొలకెత్తుతుంది.
- తక్కువ పూతతో మొక్క మరింత వేగంగా ఎదుగుతుంది.
- ఎక్కువ కాంతి, ఉష్ణోగ్రత, తేమ నుంచి తట్టుకోవడంతో పాటు తక్కువ నీటితో సాగవుతుంది.

ర్యాపిడ్ రాగి సాగుతో ఏడాదికి 75–100 టన్నుల దిగుబడి : ప్రస్తుతం పండిస్తున్నటువంటి రాగి పంటకు సగటున 26–29 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత అవసరం. కానీ అంతకంటే తక్కువ టెంపరేచర్ ఉన్నప్పటికీ ర్యాపిడ్ రకం పంట అధిక దిగుబడినిస్తుంది. ప్రస్తుతం ఎకరమునకు 7.5 నుంచి పది టన్నుల వరకు దిగుబడినిస్తోంది. అంటే ఎకరానికి పదిహేను టన్నుల నుంచి ఇరవై టన్నుల దిగుబడి మాత్రమే నన్నమాట. ర్యాపిడ్ రాగి సాగుతో ఏడాదికి 75 నుంచి 100 టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు.

ర్యాపిడ్ రాగి అత్యుత్తమ వంగడమని ఇక్రిశాట్ సీనియర్ సైంటిస్ట్ శోభన్ సజ్జా తెలిపారు. ఇది రైతులకు లాభాలను అందించడంతో పాటు సాగును రెండున్నర రెట్ల మేరకు పెంచి చిరుధాన్యాలను మరింత అందుబాటులోకి తెస్తుంది.

(ఈ టీవి భారత్ సౌజన్యంతో)

■

## 125 రోజుల పొట్టి కంది ...

**కం**ది పంట సాగులో పెద్ద ముందడుగు పడింది. ఇప్పటివరకు కంది అంటే కేవలం వర్షాకాలంలో విత్తుకునే ఖరీఫ్ పంట మాత్రమే. ఇక మీదట ఏడాదికి 3 సార్లు విత్తుకోదగిన కంది పొట్టి రకం అందుబాటులోకి వచ్చింది. 45 డిగ్రీల అధిక వేడిని కూడా తట్టుకుంటూ హెక్టారుకు 2 టన్నుల వరకు దిగుబడినిచ్చే కంది వంగడాన్ని అంతర్జాతీయ మెట్ట పంటల పరిశోధనా సంస్థ (ఇక్రిశాట్) శాస్త్రవేత్తలు రూపొందించారు.

***కంది బ్రీడింగ్ విభాగం*** సీనియర్ బ్రీడర్ డాక్టర్ గంగశెట్టి ప్రకాశ్ సారథ్యంలోని శాస్త్రవేత్తల బృందం ప్రపంచంలోనే తొలిసారి స్పీడ్ బ్రీడింగ్, స్పీడ్ చిప్పింగ్ పద్ధతుల్లో కంది వంగడాన్ని వెలువరించారు. అధిక వేడిని తట్టుకోగల 125 రోజుల్లో కోతకొచ్చే ఐసిపివి 25444 వంగడంతో 3 సీజన్లలోనూ కందులు పండించవచ్చని ఇక్రిశాట్ చెబుతోంది. ■

**జీవితమంటే మంచి మనిషిని వెదికి పట్టుకోవడం కాదు, మంచి అనుబంధం ఏర్పరచుకోవడం**

# సమగ్ర వ్యవసాయ కార్తెల పంచాంగం

| కార్తె | సుమారు తేదీలు | వాతావరణ అంచనాలు మరియు సామెతలు | చేయవలసిన వ్యవసాయ పనులు | సిపార్సు చేయబడిన పంటలు |
|---|---|---|---|---|
| అశ్వని | ఏప్రిల్ 14– ఏప్రిల్ 27 | వేసవి ఆరంభం, ఎండల తీవ్రత పెరుగుతుంది | వేసవి పైర్ల కోతలు, కత్తెర వరి నారు పోయుట | సజ్జ, వరి, వేసవి జొన్న, మొక్కజొన్న |
| భరణి | ఏప్రిల్ 28 – మే 11 | ఎండలుతీవ్రంగా ఉంటాయి. "భరణిలో పుట్టినోడు ధరణి ఏలుతాడు" (ధైర్యానికి ప్రతీక) | వేసవి దుక్కులు, భూమిని సిద్ధం చేయడం | వేసవి పనులు కొనసాగింపు |
| కృత్తిక | మే 12 – మే 25 | కత్తెర కార్తె, అత్యధిక ఉష్ణోగ్రతలు | వరి నారుమడికి భూమిని సిద్ధం చేయడం | వరి నారు పోయుట |
| రోహిణి | మే 26 – జూన్ 8 | "రోహిణి ఎండలకు రోళ్లు పగులు తాయి". తొలకరి సూచనలు | పత్తివిత్తనాలు వేయడం ప్రారంభం. దుక్కులు సిద్ధం చేయడం | పత్తి, ఆరుతడి పంటలు |
| మృగశిర | జూన్ 9 – జూన్ 22 | "మృగశిర కురిస్తే ముసలెద్దు రంకి వేయును". తొలకరి వర్గాలు | పత్తి విత్తనాలు ముమ్మరం. జొన్న విత్తుట | పత్తి, జొన్న, పప్పుధాన్యాలు |
| ఆరుద్ర | జూన్ 23– జూలై 6 | "ఆరుద్ర కురిస్తే ఆరు కార్తెలు కురుస్తాయి".విస్తారమైన వర్షాలు | వరి నారుమడులు పోయడం, నాట్లు చేయడం | వరి (ముఖ్యంగా), జొన్న, మొక్కజొన్న |
| పునర్వసు | జులై 7 – జులై 20 | వర్షాలు కొనసాగుతాయి. | వరి నాట్లు వేయడం కొనసాగింపు. అంతరకృషి | వరి, పత్తి |
| పుష్యమి | జులై 21– ఆగస్టు 3 | మంచి వర్షపాతం | వరి నాట్లు పూర్తి చేయడం, కలుపు తీత | వరి, పప్పుధాన్యాలు |
| ఆశ్లేష | ఆగస్టు 4– ఆగస్టు 17 | "ఆశ్లేష వర్షం దేశానికి నాశనం" (అధిక వర్షాలు, వరదలు) | పైర్లకు సస్యరక్షణ చర్యలు, మురుగునీటి పారుదల | వరి, పత్తి |
| మఖ | ఆగస్టు18– ఆగస్టు 31 | వర్షాలు తగ్గుముఖం పడతాయి. "మఖ పుడితే మానికంత బంగారం" | పైర్ల పెరుగుదల దశ, ఎరువుల యాజమాన్యం | ఖరీఫ్ పంటల పెరుగుదల |
| పుబ్బ | సెప్టెంబర్1– సెప్టెంబర్ 14 | "పుబ్బలో చల్లిన నువ్వులు పూత లేకుండా పోతాయి" | ఆలస్యంగా విత్తిన పంటలకు సస్యరక్షణ. | ఖరీఫ్ పంటల పెరుగుదల |
| ఉత్తర | సెప్టెంబర్15– సెప్టెంబర్ 28 | "ఉత్తర పదును ఉలవకు అదును" | స్వల్పకాలిక రబీ పంటలకు భూమిని సిద్ధం చేయడం. | ఉలవలు |
| హస్త | సెప్టెంబర్29– అక్టోబర్ 12 | "హస్తలో అడిగినంత". భారీ వర్షాలు, తుఫానుల కాలం | ఖరీఫ్ పంటల కోతకు సిద్ధం కావడం. | ఖరీఫ్ పంటలు |
| చిత్త | అక్టోబర్13 – అక్టోబర్ | 'చిత్తలో చిత్తొచ్చినంత" | 'ఖరీఫ్ పంటల కోతలు | ఖరీఫ్ పంటలు |

■

ప్రతి సమస్యకు ఎన్నో పరిష్కారాలు , నీకు తెలిసినవి అనేకం వున్నా తెలియనిది ఒక్కటైనా వుంటుంది

# ఎస్ హెచ్ జి మహిళలకు ఒక్కొక్కరికి రూ.లక్ష రుణం!

**ఆం**ధ్రప్రదేశ్‌లోని స్వయంసహాయ సంఘాల (ఎస్ హెచ్ జి – డ్వాక్రా) మహిళలకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. సంఘాల మహిళల పిల్లల చదువు కోసం ప్రభుత్వం కొత్త పథకం ప్రవేశపెట్టింది. సెర్ప్ ఆధ్వర్యంలోని స్త్రీనిధి బ్యాంకు ద్వారా రుణాలు ఇస్తారు.

ఈ పథకానికి 'ఎన్టీఆర్ విద్యా సంకల్పం'గా పేరు పెట్టాలని అధికారులు ప్రతి పాదించారు. ఇది కేజీ నుంచి పీజీ వరకు చదివే విద్యార్థులందరికీ వర్తిస్తుంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులు కూడా ఈ పథకం ద్వారా లబ్ధి పొందవచ్చు. స్త్రీనిధి నుంచి తీసుకున్న రుణాన్ని పిల్లల చదువు కోసమే ఉపయోగించాలి. ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం కొనుగోలు చేయొచ్చు. సాంకేతిక విద్యకు కూడా ఈ డబ్బును ఉపయోగించవచ్చు. ఊరి నుంచి దూరంగా ఉన్న పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు సైకిల్ కొనుక్కోవడానికి కూడా అనుమతి ఉంది. డబ్బును దేనికోసం ఖర్చు చేశారో రసీదులు స్త్రీనిధి అధికారులకు ఇవ్వాలి.

ఏపీ ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు 4% వడ్డీకే రుణాలు ఇవ్వనుంది. స్త్రీనిధి బ్యాంకు ద్వారా రూ.10 వేల నుంచి రూ. లక్ష వరకు రుణం తీసుకోవచ్చు. పిల్లల చదువుకు భరోసా కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. దీని ద్వారా పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించవచ్చు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డ్వాక్రా మహిళలకు ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద మహిళలకు ఈ పథకం ఎంతో ఉపయోగ పడుతుందని భావిస్తున్నారు. ప్రస్తుతం స్త్రీనిధి డ్వాక్రా సభ్యులకు 11% వడ్డీతో రుణాలు ఇస్తోంది. అయితే, పిల్లల చదువు కోసం వడ్డీ రేటును తగ్గించారు. తల్లిదండ్రులు ఎక్కువ వడ్డీలకు అప్పులు తెచ్చి ఇబ్బంది పడకుండా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

డ్వాక్రా మహిళలు రుణాన్ని వాయిదాల రూపంలో చెల్లించవచ్చు. తీసుకున్న మొత్తాన్ని బట్టి కనీసం 24 నెలల నుంచి గరిష్టంగా 36 నెలల వరకు గడువు ఉంటుంది. ఈ పథకం కోసం ఏడాదికి రూ.200 కోట్లు ఖర్చు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పిల్లలను చదివించేందుకు తల్లిదండ్రుల చేతిలో డబ్బులు లేక బయట ఎక్కువ వడ్డీలకు తెచ్చి అప్పులపాలవుతున్న విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం.. వారికి చేయూతగా నిలిచేందుకు కొత్త పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకం ద్వారా పేద విద్యార్థులకు మంచి భవిష్యత్తు లభిస్తుందని భావిస్తున్నారు.

**ఆన్‌లైన్‌లో రుణాలు**

నగరాలు, పట్టణాల్లో నివసిస్తున్న స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జి) మహిళలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో శుభవార్తను అందించింది. ఇప్పటివరకు రుణాలకోసం బ్యాంకుల చుట్టూతిరగాల్సిన అవసరం ఉండేది. అయితే తాజాగా తీసుకున్న నిర్ణయంతో రుణాల మంజూరు ప్రక్రియను మహిళలకు మరింత చేరువ చేసింది.

ఈ కొత్తవిధానంలో మెప్మా అధికారులకే రుణాల మంజూరు అధికారాన్ని ప్రాధాన్యతగా ఇచ్చారు. మహిళలు ఇకపై తమ సంఘాల తరపున రుణాల కోసం నేరుగా బ్యాంకులకు వెళ్లాల్సిన అవసరం లేదు. ఆన్‌లైన్ యాప్ ద్వారా ఆర్పీ లేదా మెప్మా అధికారులకు దరఖాస్తు చేస్తే సరిపోతుంది.

సంఘాలకు సంబంధించిన సమాచారం ఇప్పటికే డిజిటల్ ఫార్మాట్లో ఉండటంతో, అప్లికేషన్ సమర్పించిన తర్వాత విచారణ తక్షణమే జరుగుతుంది. రూ.5 లక్షల లోపు రుణాల కోసం మెప్మా టీఎంసీ అనుమతినిస్తారు. రూ. 5 లక్షలకు మించిన రుణాలైతే మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ) మంజూరు చేస్తారు. ఒకసారి ఆమోదం లభిస్తే, మహిళలు బ్యాంకుకు కేవలం నగదు డ్రా చేసేందుకు మాత్రమే వెళ్లాలి.

(మిగతా 21 వ పేజీలో)

# రసాయనిక ఎరువులు మోతాదు మించితే ముప్పే

**మన దేశ జనాభా అంతకంతకు పెరుగుతోంది. మరోవైపు, వ్యవసాయ భూముల్లో నిర్మాణ కార్యకలాపాలు, వాతావరణ మార్పులు, సాగునీటి కొరత అధికమవుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో దేశ ప్రజలందరికీ ఆహారం అందించడం, పోషకాహార భద్రత కల్పించడం కష్టతరంగా మారుతోంది. దాంతో అధిక దిగుబడులను సాధించేందుకు రసాయన ఎరువులను విపరీతంగా వాడుతున్నారు. దీనివల్ల అనేక అనర్థాలు సంభవిస్తున్నాయి.**

దేశంలో 'హరిత విప్లవం' ద్వారా వ్యవసాయ దిగుబడుల పెంపునకు అనేక చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా 1960 దశకంలో ఆరంభమైన రసాయన ఎరువుల వినియోగం క్రమంగా పెరిగి, ఇప్పుడు విచక్షణారహితంగా వాడటం సాధారణమైపోయింది. దీనివల్ల అన్నదాతలకు సాగు ఖర్చులు పెరగడమే కాకుండా భూసారం తగ్గిపోతోంది. మరోవైపు నేల, నీరు, వాయుకాలుష్యం పెరుగుతోంది. ఎరువులకు సబ్సిడీ అందించడం ప్రభుత్వాలకూ భారమవుతోంది. రైతులు రసాయన ఎరువులను నిపుణుల సూచనల మేరకు సక్రమంగా వినియోగించడమే అన్ని రకాలుగా శ్రేయస్కరం.

**తెలుగు రాష్ట్రాల్లోనూ...**

భారతదేశంలో నిరుడు సుమారు మూడు కోట్ల టన్నుల రసాయన ఎరువులను వినియోగించారు. ఇందులో 92లక్షల టన్నులు అంటే సుమారు 30శాతం ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకున్నవే. ఈ ఎరువుల సబ్సిడీ కోసం రూ.1.75 లక్షల కోట్లు ఖర్చుచేశారు. హెక్టారుకు జాతీయ సరాసరి రసాయన ఎరువుల వినియోగం 140 కిలోలు. ఆంధ్రప్రదేశ్‌లో అది 233 కిలోలు కాగా, తెలంగాణలో 283, పంజాబ్‌లో 253, హరియాణాలో 221 కిలోలు. దేశంలో సమతుల ఎరువుల వినియోగానికి నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులను 4:2:1 నిష్పత్తిలో వినియోగించాలన్నది వ్యవసాయ శాస్త్రవేత్తల మేలిమి సూచన. కానీ, జాతీయ స్థాయిలో ఈ ఎరువుల సరాసరి వినియోగ నిష్పత్తి 10.9:4.4:1గా ఉంటోంది. అంటే నత్రజని, భాస్వరం వాడకం చాలా ఎక్కువగా ఉంటోందన్న మాట. కొన్ని రాష్ట్రాల్లోనైతే వీటి వినియోగ నిష్పత్తి ఆందోళనకర స్థాయిలో ఉన్నట్లు గుర్తించారు. ఇది రాజస్థాన్‌లో 39:14:1, పంజాబ్‌లో 31:7:1, హరియాణాలో 23:6:1, తెలంగాణలో 10:3.4:1, ఏపీలో 6.5:2.8:1గా నమోదైంది. ప్రత్యేకించి కొన్ని జిల్లాల్లోనైతే ఎరువుల వినియోగం అత్యంత అసమతుల్యంగా ఉంటోంది. ఉదాహరణకు ఏపీలోని గుంటూరు జిల్లాలో నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువుల వినియోగ నిష్పత్తి 13:7:1గా, తిరుపతి జిల్లాలో 12:6:1, చిత్తూరులో 11:3:1, శ్రీకాకుళంలో 10:3:1గా ఉంది. ఈ ఎరువులను అధిక మోతాదులో వాడటం వల్ల నేలలో సూక్ష్మధాతు లోపాలు ఏర్పడతాయి.

**విచ్చలవిడి వాడకం.. నేల నిస్సారం**

రసాయన ఎరువులను అధిక మోతాదులో విచక్షణారహితంగా వినియోగించడం వల్ల నేలలో పోషకాల అసమతుల్యత ఏర్పడుతుంది. కీలకమైన సూక్ష్మజీవులు నశించిపోతాయి. దాంతో పంట భూమి నిస్సారమవుతుంది. మరోవైపు, అధికంగా వాడే రసాయనాలు వర్షపు నీటితో కలిసి సమీప చెరువులు, కుంటల్లోకి చేరతాయి. దీనివల్ల 'ఆల్గే' పెరిగి నీరు కలుషితం కావడంతో పాటు చేపలు, రొయ్యలు వంటి జలచరాల మనుగడ ప్రశ్నార్థకమవుతోంది. పంజాబ్, హరియాణా వంటి రాష్ట్రాల్లో నత్రజనిని అధికంగా వాడటం వల్ల అక్కడి భూగర్భ జలాలు తీవ్రంగా కలుషితమైనట్లు నిర్ధారించారు. అధిక పాళ్లలో వాడే నత్రజని గాలిలో నైట్రస్ ఆక్సైడ్ పెరగడానికి కారణమవుతుంది. ఇది కార్బన్ డైఆక్సైడ్ కంటే 300 రెట్లు ప్రమాదకరం! మరో ముఖ్యమైన విషయం– పంట పొలాల్లో అధికంగా రసాయన

ఎరువులను వాడటం వల్ల వాటి సామర్థ్యం తగ్గిపోవడం. దేశంలో సరాసరి నత్రజని వినియోగ సామర్థ్యం నలభై శాతమే. అంటే, వంద కిలోల నత్రజని ఎరువును పొలానికి వేస్తే నలభై కిలోలే పైరుకు అందుతున్నాయి. మిగిలిన అరవై కిలోలు వివిధ మార్గాల్లో వ్యర్థమవుతున్నాయి. భాస్వరం సరాసరి వినియోగ సామర్థ్యం పదిహేను శాతం, పొటాష్ యాభై శాతం, సూక్ష్మపోషక ఎరువులు అయిదు శాతంగా ఉండటం ఆందోళనకరం. రైతులు సాగు వ్యయంలో దాదాపు ఇరవై అయిదు శాతం రసాయన ఎరువుల కోసమే వెచ్చిస్తున్నారు. వీటిని సరైన విధానంలో వాడితే ఈ ఖర్చు చాలావరకు తగ్గిపోతుంది.

**బయటపడే మార్గాలేంటి?**

దేశంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణుల సూచనలకు అనుగుణంగా రైతులు ఎరువులను వినియోగించేలా చూడటం ముఖ్యం. భూసార పరీక్షల ద్వారా నేల స్వభావం, సమస్య లతో పాటు నత్రజని, భాస్వరం, పొటాష్, జింక్, ఇనుము వంటి పోషకాల లభ్యత ఎలా ఉందో తెలుసుకోవచ్చు. దీన్ని బట్టి పైరుకు పోషకాలు సమతులంగా అందాలంటే రసాయన ఎరువులను ఎంతవరకు వాడాలో లెక్కకట్టి వేసుకోవచ్చు. ఇందుకోసం కేంద్రం తీసుకొచ్చిన 'సాయిల్ హెల్త్‌కార్డ్ స్కీమ్' గురించి అన్నదాతలందరికీ అవగాహన కల్పించాలి. మరోవైపు, సూక్ష్మ ధాతు ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాలి. ఇది నేలలో పోషకాల వినియోగ సామర్థ్యాన్ని పెంచి, అధిక దిగుబడులు రావడానికి సాయపడుతుంది. కాలుష్యమూ తగ్గుతుంది. పశువుల ఎరువుకు తోడు పచ్చిరొట్ట, జీవ, రసాయన ఎరువుల్ని సమగ్రంగా వాడితే, రసాయనాల అవసరం 30శాతం మేర తగ్గిపోతుంది. భూసారం మెరుగుపడుతుంది. ఖర్చు ఆదా అవుతుంది. రైతులు పంట మార్పిడి విధానాలను పాటించడం, వరి తరవాత అపరాలను సాగుచేయడం చాలా మేలు చేస్తుంది. అపరాల మొక్కలు గాలిలోని నత్రజనిని నేలలో స్థిరీకరిస్తాయి. దీనివల్ల భూమి సారవంతమవుతుంది.

దేశీయంగా వీలైనంతగా సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన అవసరముంది. సేంద్రియ ఎరువులతో పాటు గోవు ఆధారిత ఘనజీవామృతం, ద్రవజీవామృతం నేల ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయి. వీటితో పాటు సమస్యాత్మకంగా మారిన ఆమ్ల, క్షార, కారి భూములను గుర్తించి, సరైన సాంకేతిక యాజమాన్య పద్ధతుల్లో వాటిని బాగు చేసుకోవాలి. తద్వారా ఎరువుల వినియోగ సామర్థ్యం పెరిగి నాణ్యమైన దిగుబడులు భారీగా అందివస్తాయి.

– ఈనాడు సౌజన్యంతో

■

## ఎస్ హెచ్ జి మహిళలకు లక్ష రుణం

(19 వ పేజీ తరువాయి)

ఈ ప్రక్రియలో మహిళాకాశం, ఎంఎల్‌సీసీ అనే యాప్‌లు కీలకపాత్ర పోషించనున్నాయి. ఈ యాప్‌ల ద్వారా సంఘాల నమోదు నుంచి, సమాచారం అప్‌డేట్, అప్లికేషన్ స్టేటస్, మంజూరు వరకు ప్రతి దశా పూర్తిగా ఆన్‌లైన్‌లోనే జరుగుతుంది. స్వయం సహాయ సంఘాలకు సంబంధించిన రుణాల మంజూరులో గతంలో కొందరు సభ్యులు ఒకేసారి రెండు లేదా మూడు సంఘాల్లో సభ్యులుగా ఉండి, తరచూ రుణాలు తీసుకుంటూ ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీశారని అధికారులు పేర్కొన్నారు. ఈ తరహా దుర్వినియోగాలను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త ఆన్‌లైన్ విధానం కీలకంగా మారుతోందన్నారు.

'ఈ విధానం ద్వారా రుణ మంజూరు ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ట్రాక్ చేయగలిగే విధంగా మారింది. ఇప్పటివరకు కొందరు మహిళలు తమ గ్రూప్ సభ్యులకు తెలియకుండా బ్యాంకుల ద్వారా రుణాలను పొందుతూ, వాటిని తిరిగి చెల్లించకుండా మిగతా సభ్యులను ఇబ్బందుల్లోకి నెట్టిన సంఘటనలు అనేకం. అయితే ఇప్పుడు రుణం మంజూరయ్యాక గ్రూపు లీడర్ మొబైల్‌కు ఓటీపీ వెళ్లేలా ఏర్పాటు చేయడం వల్ల, ఎవరి పేరుతో రుణం మంజూరవుతుందో గ్రూప్ మొత్తానికి స్పష్టంగా తెలుస్తుంది' అని అధికారులు వివరించారు.

కొత్తవిధానంవల్లగ్రూప్ సభ్యులకు ముందే సమాచారం అందుతుందని, ఒక్కరిపై రుణభారం పడకుండా సమష్టిగా చర్చించి, నిర్ణయం తీసుకునేఅవకాశం లభిస్తుంది.

■

**సానుకూల ధోరణిలో అర్థంచేసుకునే స్వభావం వుంటే, కష్టమైనా, సుఖమైనా ఆనందమే**

# చూపు లేని వారికి చుక్కానిలా మీరా బద్వే !

**అం**ధ విద్యార్థులకు పాఠాలు చెప్పడంతో మొదలై, వారికి అన్నీ తానై నిలిచే వరకూ... మీరా బద్వేది సుదీర్ఘమైన ప్రయాణం. దాదాపు ముప్పయ్యేళ్లుగా... వేలమంది అంధులకు విద్య, ఆశ్రయం, ఉపాధి కల్పన ద్వారా వారి సర్వతోముఖాభివృద్ధికి ఆమె దోహదం చేస్తున్నారు. "ఎవరో వస్తారని ఎదురుచూడడం కన్నా మనమే ముందడుగు వెయ్యాలి" అంటున్న మీరా బద్వే కథ ఆమె మాటల్లోనే...

"ప్రతి ఒక్కరికీ ఏదో ఒక సమయంలో 'నా జీవితానికి అర్థమేమిటి?' అనే ప్రశ్న ఎదురవుతుంది. జీవితాన్ని అర్థవంతంగా చేసుకోవడానికి మనం చేసే ప్రయత్నాల్లో... ఎంతో ఆలోచించి అమలు చేసినవి విఫలమవుతాయి. కానీ ఎలాంటి ప్రణాళిక లేకుండా చేసిన కొన్ని పనులు మన జీవితానికి వినూత్నమైన నిర్వచనాన్ని ఇస్తాయి. అలాంటి మార్పు తెచ్చిన సంఘటన ముప్పయ్యేళ్ళ క్రితం జరిగింది. నేను పుట్టింది మహారాష్ట్రలోని పుణేలో. చదువు పూర్తయ్యాక పాఠశాలలు, కళాశాలల్లో ఆంగ్ల బోధకురాలుగా పని చేశాను. వివాహమై, మా అమ్మాయి ఉమ పుట్టిన తరువాత ఉద్యోగం వదిలి, పూర్తిగా ఇంటి బాధ్యతలకే పరిమితం అయి పోయాను. అయితే ఏదో వెలితిగా ఉండేది. అందుకే మా అమ్మాయి కాస్త పెద్దది కాగానే... ఒక కాలేజీ నుంచి వచ్చిన అవకాశాన్ని అంగీకరించాను. కానీ అక్కడ చేరేలోగా... స్థానికంగా ఉన్న అంధుల పాఠశాల సందర్శన నన్ను కొత్త దారిలో నడిపించింది.



**వారి భరోసాతో కళ్ళలో నీళ్ళు తిరిగాయి...**

నా భర్తకు చాలా సంవత్సరాలుగా ఒక అంధుల పాఠశాలకు విరాళాలు ఇవ్వడం ఆనవాయితీ. ఒకసారి ఆయనతోపాటు ఆ పాఠశాలకు వెళ్ళాను. అప్పుడు అక్కడ అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఎంతోమంది పిల్లలు క్యూలో నిలబడి ఉన్నారు. 'అపరిచితమైన కొత్త ప్రదేశంలో ఎలా ఉండాలా?' అనే బాధ, దిగులు వారిలో కనిపిస్తున్నాయి. ఇంతలో ఒక పిల్లాడు ఆ క్యూ మధ్యలోనుంచి పరిగెత్తుతూ వచ్చాడు. దారిలో ఉన్న నన్ను గట్టిగా పట్టుకున్నాడు. నేను అతని తల్లిని అనుకున్నాడు. ఇంటికి తీసుకువెళ్ళాలంటూ ఏడుస్తున్నాడు. ఈలోగా తల్లితండ్రులు వచ్చి అతన్ని తీసుకుపోయారు. నేను, నా భర్త తిరిగి వెళ్తున్నప్పుడు "ఈ పిల్లల కోసం ఏదైనా చెయ్యాలని ఉంది. ఇక్కడే టీచర్‌గా చేరాలనుకుంటున్నాను" అని చెప్పాను. నాకు గతంలో అనుభవం ఉంది కాబట్టి అక్కడ బోధకురాలుగా చేరడం కష్టం కాలేదు. అయితే చేరిన తరువాత మాత్రం ఎన్నో సవాళ్ళు ఎదురయ్యాయి. అప్పటికి నాకు బ్రెయిలీ రాకపోవడంతో బోధించడానికి తడబడ్డాను. కానీ క్రమంగా పిల్లలతో నాకు మంచి అనుబంధం ఏర్పడింది. నేను ఇబ్బంది పడుతున్నానని గ్రహించిన ఆ పిల్లలు "మీకు బ్రెయిలీ రాదని మమ్మల్ని వదిలేసి వెళ్ళొద్దు టీచర్! మీకు మేము నేర్పిస్తాం" అని భరోసా ఇచ్చినప్పుడు నాకు కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఆ తరువాత బ్రెయిలీ నేర్చుకున్నాను. వారితో మమేకమైన నేను మూడేళ్ళ తరువాత ఆ ఉద్యోగం మానెయ్యాల్సి వచ్చింది.

**ఆ ధోరణి భరించలేక...**

పిల్లలకు వారి వైకల్యాన్ని పదేపదే గుర్తు చేసేలా వ్యవహరించకూడదనేది నా ఉద్దేశం. "వారూ అందరు పిల్లల్లాంటివారే. అల్లరి చేస్తారు. ఆటలు ఆడతారు. కొత్త విషయాలు తెలుసుకోవాలని ఉత్సాహపడతారు. వారికీ ఇష్టాయిష్టాలుంటాయి. ఇవేవీ పట్టించుకోకుండా... వారు కుంగిపోయేలా ప్రవర్తించకూడదు" అని నేను చాలా సందర్భాల్లో స్కూల్ నిర్వాహకులకు చెప్పాను. కానీ పట్టించుకోలేదు. ఆ ధోరణి భరించలేక... రాజీనామా చేశాను. తరువాత ఒక రోజు ఆ స్కూల్ విద్యార్థి నన్ను వెతుక్కుంటూ వచ్చాడు.

గారడీతో కల నెరవేరదు; తపన పడాలి, పట్టుదల పెరగాలి, చెమట చిందించాలి

అతను చదువుతున్నది తొమ్మిదో తరగతి. కానీ వయసు పద్దెనిమిదేళ్ళు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం... అతను వయోజనుడయ్యాడు కాబట్టి బ్లయిండ్ స్కూల్‌లో అతను ఉండడం కుదరదు. అతని చదువు, వసతి, భోజన ఖర్చులను అతనే సంపాదించుకోవాలి. అందుకని అతణ్ణి స్కూల్‌లోంచి బయటకు పంపేశారు. అతణ్ణి తల్లితండ్రులు ఎప్పుడో వదిలేశారు. ఎక్కడికి వెళ్ళాలో తెలియక... మూడు వారాలపాటు సరైన తిండి లేకుండా రోడ్ల మీద తిరిగాడు. చివరకు మా ఇంటికి వచ్చాడు. ఆ పిల్లవాడికి ఆశ్రయం కల్పించి, అతని చదువుకు సాయం చేశాను. ఎంతో కష్టపడి చదివిన అతను పదోతరగతిలో నూరుశాతం మార్కులు తెచ్చుకున్నప్పుడు... తీవ్రమైన ఉద్వేగానికి గురయ్యాను. మానవీయత కరువైన విధానాల వల్ల ఇలాంటి ఎందరో పిల్లల జీవితాలు నాశనమై పోతున్నాయనే ఆవేదన కలిగింది. సమాజం వారికి సాయం చెయ్యడానికి ముందుకు రాదు. ఆర్థిక స్థోమత లేని కుటుంబాలు వారిని భారంగా చూస్తాయి. ఈ పరిస్థితిలో... ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఎదురుచూడడం కన్నా... నేనే వారికో దారి చూపాలనుకున్నాను. 1996లో... 'నివంత్ అంధ్ ముక్త వికాసాలయ్' పేరుతో ఒక సంస్థను ప్రారంభించాను.

**ఆ నమ్మకం ఉంది...**

ఇరవై తొమ్మిది ఏళ్ళ క్రితం... ఒకే ఒక విద్యార్థితో మొదలైన మా 'నివంత్' ఇప్పుడు విద్య, జీవన నైపుణ్యాలను నేర్పిస్తూ, భావోద్వేగమైన మద్దతును అందించే కేంద్రంగా అభివృద్ధి చెందింది. అప్పట్లో మాకు వనరులు, నిధులు తక్కువగా ఉండేవి. బ్రెయిలీ వచ్చిన విద్యార్థులు తక్కువ. బ్రెయిలీలో పుస్తకాలను చేతుల్తో రాసుకోవలసి వచ్చేది. అలా దాదాపు 300కు పైగా పుస్తకాలను మా విద్యార్థులు ఎంతో శ్రమ పడి రాశారు. 2007లో బ్రెయిలీ ప్రింటర్ సమకూర్చుకోవడంతో.. ఈ పని సులభం అయింది. ఆ తరువాత 'విజన్ అన్‌లిమిటెడ్' అనే లైబ్రరీని ఏర్పాటు చేశాం. మూడువేలకు పైగా పుస్తకాలు అందులో ఉన్నాయి.

రోటరీ క్లబ్ లాంటి సంస్థల సహాయంతో.... పాఠ్య, పాఠ్యేతర అంశాలతో మేము ఏడాదికి లక్షన్నర పేజీలకు పైగా బ్రెయిలీ పుస్తకాలను ముద్రిస్తున్నాం. మహారాష్ట్ర వ్యాప్తంగా పదిహేడు కేంద్రాల్లో ఈ లైబ్రరీ అంధులకు సేవలు అందిస్తోంది. మా సంస్థలో ఇప్పటివరకూ 3,500 మందికి పైగా అంధ బాలలు ఆశ్రయం పొందారు. అందరూ స్వతంత్రంగా జీవించే నైపుణ్యాలను సాధించారు.

ఈ ప్రయత్నంలో నా భర్త, కుమార్తె కూడా నాకు పూర్తి మద్దతుగా నిలుస్తున్నారు. వారి సహకారంతోనే 'స్వలేఖన్ టైపింగ్ ట్యూటర్' అనే యాప్‌ను ఆరేళ్ళ కిందట ఆవిష్కరించాం. అనేక భాషల్లో టైపింగ్‌ను నేర్పే ఈ యాప్ ద్వారా... అంధులైన విద్యార్థులు ఎవరి సాయం లేకుండా పరీక్షలు రాయవచ్చు.




పుణేలో కొన్ని అంధ బాలల పాఠశాలల్లో పిల్లలకు ఈ యాప్ వినియోగంలో శిక్షణ ఇస్తున్నాం. 2,000 మందికి పైగా పిల్లలు దీన్ని ఉపయోగిస్తున్నారు.

అలాగే... మేము సొంతంగా 'టెక్ విజన్' అనే సాఫ్ట్‌వేర్‌ను రూపొందించుకున్నాం. దీనిలో వ్యాపార అవకాశాలు ఉన్నాయనే విషయం గ్రహించి... ఇరవైమంది అంధ విద్యార్థుల బృందంతో ఒక కంపెనీని ఏర్పాటు చేశాం. ఇప్పుడు ఈ కంపెనీ ద్వారా ఏడాదికి నాలుగైదు కోట్ల రూపాయల లాభం వస్తోంది. అలాగే మా విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తోంది. వెనక్కి తిరిగి చూసుకుంటే ఎంతో సంతృప్తిగా అనిపిస్తోంది. ఇంకా చేయాల్సింది ఎంతో ఉందని నాకు తెలుసు. కానీ నా తరువాత ఈ బాధ్యతను మా విద్యార్థులు ఇంకా సమర్థవంతంగా నిర్వర్తిస్తారనే నమ్మకం నాకుంది."

■

మాటలతోనే కాదు మౌనంతోనూ గెలవవచ్చు

# పసుపు పంటతో ప్రపంచ దృష్టిని ఆకర్షించిన మన్యం మహిళ!

పార్వతీపురం మన్యం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతం సాలూరులో అన్నాడి సునీత అనే మహిళ ఇరవై సంవత్సరాల క్రితం ప్రారంభించిన ఒక చిన్న కుటీర పరిశ్రమ నేడు అంతర్జాతీయ మార్కెట్ వరకు విస్తరించింది. ఎలాంటి వ్యాపార అనుభవం లేకపోయినా జీవనోపాధి కోసం ప్రారంభించిన పసుపు ఉత్పత్తుల వ్యాపారం నేడు ఆమెను ఉత్తమ పారిశ్రామిక వేత్తగా నిలబెట్టింది. ప్రారంభించిన తొలినాళ్లలో స్థానిక గిరిజనుల సహకారంతో మన్యం




ఏజెన్సీలో పసుపును సేకరించి ఆ పసుపును శుద్ధి చేసి, ప్యాకింగ్ చేసి విక్రయించడం ప్రారంభించింది.

ఆ వ్యాపారంతో స్థానిక గ్రామీణ గిరిజన మహిళలకు ఉపాధి కల్పిస్తూ, స్థానికంగా పసుపు సాగును ప్రోత్సహిస్తూ అంచెలంచెలుగా పరిశ్రమను విస్తరించారు. నేడు ఆమె స్థాపించిన పరిశ్రమ తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలతో పాటు అరబ్ దేశాలకు, యూరప్ మార్కెట్‌లకు కూడా ఎగుమతులు చేస్తోంది.

ఇరవై ఏళ్ల క్రితం కుటీర పరిశ్రమగా ప్రారంభమైన ఈ పసుపు వ్యాపారం నేడు కోట్ల రూపాయల టర్నోవర్‌కు చేరుకుంది. ఒక మహిళ ఒక వ్యాపారం స్థాపించి అభివృద్ధి చేయాలంటే ఎన్నో అడ్డంకులు వచ్చే ఈ రోజుల్లో అలాంటి వాటిని అన్నింటినీ అధిగమించి తాను నమ్ముకున్న నాణ్యత, నిజాయితీ సునీత పరిశ్రమను పసుపు ఉత్పత్తుల తయారీలో రారాజుగా నిలిపింది.

ఆమె పడిన కష్టం చేసిన శ్రమ ఈరోజు సునీతను ఉత్తమ మహిళ వ్యాపారవేత్తగా నిలబెట్టింది. ఆమె విజయాన్ని గుర్తించిన పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్ సునీతకు ఉత్తమ పారిశ్రామిక వేత్త అవార్డును అందించి ప్రశంసించారు. సునీత మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఆమెకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

సునీత అందుకున్న ఈ గౌరవం మన్యం ప్రాంతానికే గర్వకారణంగా నిలిపిందని పలువురు వ్యాపారులు కొనియాడుతున్నారు. గ్రామీణ మహిళలు కూడా చిన్నపాటి వ్యాపారం ప్రారంభించి పెద్దస్థాయి వ్యాపార రంగంలో చోటు సంపాదించగలరని నిరూపించిన సునీత ప్రస్తుతం కొత్తగా వ్యాపారాలు ప్రారంభించే యువతకు ఆదర్శంగా నిలిచారు.

ప్రస్తుతం ఆమె పరిశ్రమలో వంద మంది వరకు మహిళలు పని చేస్తున్నారు. ఈమె వద్ద తయారయ్యే ఆర్గానిక్ పసుపు, పసుపు పొడి, కాస్మొటిక్స్‌కు విశేష డిమాండ్ ఏర్పడింది. ఆమె విజయం పలువురికి ఆదర్శంగా నిలిచింది.

సునీత పరిశ్రమ ఇప్పుడు కేవలం ఒక వ్యాపారంగా మాత్రమే కాక స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే ఒక శక్తిగా మారింది. ఆమె స్థాపించిన ఈ పరిశ్రమ గిరిజనుల ఆర్థిక స్వావలంబనకు ఎంతగానో దోహదపడుతుందని కొనియాడారు ఎస్టీ కమీషన్ చైర్మన్ డివిజి శంకరరావు, స్వర్ణ దంపతులు. ■



వెనుక చింతించడం కంటె ముందు జాగ్రత్తపడడం మంచిది

# మన్యం ముఖచిత్రాన్ని మార్చిన ఆగ్రోఫారెస్ట్రీ !

**'మా** పక్కన సముద్రం లేదు కాబట్టి ఉప్పు పండించడం లేదు కానీ, వంట నూనె కూడా మేమే తయారు చేసు కుంటాం!' అన్నారు చుట్టూ పసుపు తివాచీలా పరుచుకున్న వలిసిపూలను చూపిస్తూ ఈ జంట! కొండల కింద పరిచిన పసుపు పచ్చని తివాచీ మీద నడుస్తున్నట్టుంది ఈ వలిసిపూల వనం.

అతడి పేరు సాంబ. ఆదివాసీల్లో అత్యంత వెనుకబడిన కోందు తెగ రైతు. 'ఏ తెగలో పుట్టాలనేది ఎవరి చేతుల్లోనూ ఉండదు కానీ, ఎలా ఎదగాలనేది మన చేతుల్లోనే ఉంటుంది.' అన్నాడు కోతకు సిద్ధంగా ఉన్న సామ కంకులను చూపిస్తూ.

"రెండకరాల్లో రాగులు పండించేవాణ్ణి. సరైన దిగుబడి వచ్చేది కాదు. కొన్నిసార్లు పెట్టిన పెట్టుబడి కూడా వచ్చేది కాదు. సేద్యం మానేసి మరో పనేదైనా చూసుకుందాం అనిపించేది. అలాంటి పరిస్థితుల్లో 'ఆగ్రో ఫారెస్ట్రీ' విధానం తెలిసి శిక్షణ తీసుకున్నా. ఆ తరువాత నా జీవితమే మారి పోయింది. ఇప్పుడు నా పొలంలో పండిన పసుపు కోసం ఆస్ట్రేలియా నుంచి ఆర్డర్లు వస్తున్నాయి" అన్నాడు పసుపు పంట అనంతరం వేసిన స్వీట్ పొటాటో పొలం వైపు నడుస్తూ.

పాడేరు ఏజెన్సీ (అల్లూరి సీతారామరాజు జిల్లా, ఆంధ్రప్రదేశ్)లో జీవిస్తున్న అదివాసీల్లో అత్యంత వెనుకబడిన అరుదైన తెగ 'కోందులు' (వల్నరబుల్ ట్రైబల్ గ్రూప్స్). వారిలో చాలామందికి తెలుగు సరిగా రాదు. లిపిలేని 'కువి' భాషలో మాట్లాడతారు. కాఫీ తోటల్లో పనులకు వెళ్తారు.

కొందరు కొండల్లో నుండి పారే ఊటనీటితో వాలులో మెట్లు కట్టి వరి, కూరగాయలు పండిస్తారు. నీటి వసతి లేని చోట రాగులు, సజ్జలు సాగు చేసుకుంటారు. ఆ తెగలోని రైతే సీదరి సాంబ. పరదేశీ పుటు (పాడేరు మండలం)లో రెండు ఎకరాలు సేద్యం చేస్తున్నాడు.

**జీవితాన్ని మార్చిన 'ఆగ్రో ఫారెస్ట్రీ'**

తూరుపు మన్యం ప్రజలు ఏడాదిలో సగం రోజులు అడవిపై, మిగతా కాలం వ్యవసాయంపై ఆధారపడతారు. స్థిరమైన బతుకుతెరువు లేక పలు సమస్యలు ఎదు ర్కొంటున్నారు. వ్యవసాయ, అటవీ ఉత్పత్తుల వినియోగంలో అవగాహన లోపం, పోడు వ్యవసాయం పెరగడం, అడవులు తగ్గిపోవడం వలన పాడేరు ఏజెన్సీలో పచ్చదనం క్షీణించి జీవ వైవిధ్యం దెబ్బతింటోంది. ఈ నేపథ్యంలో 'ఆగ్రోఫారెస్ట్రీ' ని 'అమృతా వెల్ఫేర్ సొసైటీ ' అమలు చేసింది.

**ఆగ్రోఫారెస్ట్రీ అంటే?**

ఒక ఎకరం పొలంలో ఏడాదంతా పలురకాల పంటల మీద ఆదాయం అందుకోవడమే ఆగ్రో ఫారెస్ట్రీ. ఎకరం భూమిని నాలుగు ముక్కలు చేస్తారు. ఒక భాగంలో మామిడి, సపోటా, పనస, జామ వంటి పండ్ల తోటలు. రెండవ భాగంలో రాగులు, సజ్జలు, జొన్నలు వంటి చిరుధాన్యాలు. మూడవ భాగంలో అన్ని రకాల ఆకుకూరలు, తీగజాతి కాయగూరలు. నాలుగవ భాగంలో అశ్వగంధ, తిప్పతీగ, నన్నారి వంటి ఔషధ సుగంధ మొక్కలు. పొలం చుట్టూ సరిహద్దుల్లో కిత్త నార, టేకు, అరటి పెంచుతారు. ఇదంతా వాతావరణ మార్పులను ఎదుర్కొనే కొత్త వ్యవసాయ విధానం. ఆంధ్రప్రదేశ్‌లోని, అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరు మన్యంలో కొందరు రైతులతో ఆగ్రో ఫారెస్ట్రీని అమలు చేయించారు. వారిలో సక్సెస్ అయిన రైతే సాంబ.

**ఆస్ట్రేలియాకు ఎగుమతి...**

"రెండెకరాల్లోని ఒక ఎకరంలో జొన్న, సామలు వేశాను. మరో ఎకరాన్ని నాలుగు భాగాలు చేసి అల్లం, పసుపు, చిలగడ దుంపలు (స్వీట్ పొటాటో), వలిసెలతో పాటు పిప్పళ్లు, నన్నారి వంటి ఔషధ పంటలు పండిస్తున్నాం. పొలం చుట్టూ సరిహద్దులో అరటి, టేకు పెంచుతున్నాం. ఇది పూర్తిగా ప్రకృతి వ్యవసాయం. సొంత విత్తనాలు

# పుట్టగొడుగుల పెంపకంలో 6 సులభమైన దశలు

**తి**నదగిన ఫంగస్‌ను సాధారణంగా పుట్టగొడుగు (మష్రూమ్) అంటారు. ఇది కండ, బీజాంశాన్ని కలిగి ఉండే ఫంగస్ ఫలాలు కాస్తాయి. ఇది సాధారణంగా నేలపై లేదా దాని ఆహార వనరుపై ఉత్పత్తి అవుతుంది. ఇతర శిలీంధ్రాల వలె, ఇది క్లోరోఫిల్‌ను కలిగి ఉండదు మరియు పోషణ కోసం మరొక జీవి తయారుచేసిన ఆహారంపై ఆధారపడాలి. అందువల్ల, ఇది చనిపోయిన జీవులపై లేదా ఇతర జీవులతో సహజీవనంలో ఒంటరిగా పెరుగుతుంది.

**పుట్టగొడుగుల వర్గీకరణ :-**

1. తినదగిన పుట్టగొడుగు –

ఎ. ఆయిస్టర్ మష్రూమ్ (ప్లూరోటస్ ఒస్ట్రియాటస్)

బి. వరి గడ్డి పుట్టగొడుగు ( వోల్వరిల్లా వాల్వేసియా)

సి. వైట్ బటన్ ( అగ్రికస్ బిస్పోరస్)

**సాగు ప్రక్రియ –:**

పుట్టగొడుగుల పెంపకంలో 6 ప్రధాన దశలు ఉన్నాయి

1. దశ 1 కంపోస్టింగ్ – కంపోస్ట్‌లో రెండు రకాలు ఉన్నాయి. అవి ... ఎ. సహజ కంపోస్ట్ – ఇది గడ్డి, గుర్రపు ఎరువు, కోళ్ల ఎరువు మొదలైన ముడి పదార్థాలతో తయారు చేయబడింది.



బి. సింథటిక్ కంపోస్ట్ – ఇది ఊక, గడ్డి, యూరియా,

---

నాటుతాం. మా పంటల్లో పసుపుకు డిమాండ్ బాగుంది. గత కొన్నేళ్లుగా ఆస్ట్రేలియాకు ఎగుమతి అవుతోంది. చిలగడ దుంపలను ఒడిశా వర్తకులు కొంటున్నారు” అన్నాడు సాంబ.

**ఔషధగుణాలు అధికం...**

మన్యంలో సహజంగా పారే ఊటనీటితో పండించే పసుపులో ఔషధ విలువలు ఎక్కువగా ఉంటాయి. అందుకే విదేశాల్లో డిమాండ్. ‘స్పైస్ ఇండియా’ వారు సాంబను సంప్రదించగా 23 టన్నుల పసుపు పంపారు. మరో 50 టన్నుల వరకు ఆర్డర్ వచ్చింది. సాంబను చూసి మిగతా రైతులు కూడా ముందుకు రావడంతో వారి నుంచి సేకరించిన పసుపును పంపుతున్నాడు. ఇతడు పండిస్తున్న పిప్పళ్లు, నన్నారి పంటల దిగుబడిని ప్రతీ సంవత్సరం తీసుకోవడానికి తమిళనాడుకు చెందిన ఆయుర్వేద కంపెనీ రైతుతో ఒప్పందం కుదుర్చుకుంది.

ఆదివాసీల్లో అత్యంత వెనుకబడిన వర్గానికి చెందిన సాంబ సాగులోనే కాదు చదువులోనూ ముందున్నాడు. ఎమ్మెస్సీ బీఈడీ చేశాడు. వ్యవసాయం మీద మక్కువతో ఉద్యోగ ప్రయత్నాలేవీ చేయకుండా సేద్యమే జీవితంగా సాంబ సాగు చేస్తున్న అరుదైన మరో పంట వలిసెలు. అరకు నుంచి పాడేరు వరకు కొండవాలులో ఈ నూనె గింజలను పెంచుతారు.

“ఈసారి రెండు బస్తాలు దిగుబడి వచ్చింది. 2 కిలోల వలిసెల గింజలను మిల్‌లో ఆడిస్తే కిలో ఆయిల్ వస్తుంది. ఏడాదంతా వంటలకు వాడుకుంటాం. మిగిలితే సంతలో అమ్ముకుంటాం. కొలెస్ట్రాల్ తక్కువ, ఆరోగ్యానికి మంచిదని చాలామంది మా దగ్గరకు వచ్చి అడుగుతుంటారు. మా గ్రామంలో 90 శాతం మంది ఇదే నూనె వాడుతారు” అంది వలిసె పూలను చూపిస్తూ సాంబ భార్య. ■

మొరిగే కుక్కతో ముప్పు లేదు, మొరగని కుక్కతోనే ముప్పంతా

కాల్షియం అమ్మోనియం నైట్రేట్ లేదా అమ్మోనియం సల్ఫేట్ మరియు జిప్సం మొదలైన ముడి పదార్థాలతో తయారు చేయబడింది. ఫేజ్ 1 కంపోస్టింగ్‌లో మేము ముడి పదార్థాన్ని కలపడం మరియు తడి చేయడం ద్వారా కంపోస్ట్ తయారు చేసాము. పదార్థం తడిగా మరియు సూక్ష్మజీవుల పెరుగుదల మరియు పునరుత్పత్తి ఫలితంగా ఏరోబిక్ కిణ్వ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఫేజ్ 1 కంపోస్టింగ్ ఈ కంపోస్ట్ సిద్ధం కావడానికి కనీసం 5–18 రోజులు పడుతుంది. ఎన్ని రోజుల్లో పూర్తిగా సిద్ధంగా ఉంటుంది అనేది ముడి పదార్థంపై ఆధారపడి ఉంటుంది.

2. దశ 2 కంపోస్టింగ్ – ఫేజ్ 2 కంపోస్టింగ్ యొక్క ప్రధాన దృష్టి పాశ్చరైజేషన్ మరియు ఫేజ్ 1 సమయంలో ఏర్పడిన అమ్మోనియాను తొలగించడం. 0.7 కంటే ఎక్కువ గాఢత మైసిలియం స్పాన్ పెరుగుదలకు ప్రమాదకరం, కాబట్టి అమ్మోనియాను తొలగించడం చాలా ముఖ్యం. 125 డిగ్రీల ఫారెన్ హీట్ నుండి 130 డిగ్రీల ఫారెన్‌హీట్ వరకు అత్యంత ఖచ్చితమైన ఉష్ణోగ్రత, ఎందుకంటే డీ–అమ్మోని ఫైయింగ్ జీవి ఈ పరిధిలో బాగా పెరుగుతుంది. దశ 2 ముగింపులో ఉష్ణోగ్రత సుమారుగా 75డిగ్రీల ఫారెన్‌హీట్ నుండి 80 డిగ్రీల ఫారెన్‌హీట్ వరకు ఉండాలి. నత్రజని 2.0 నుండి 2.4% మరియు తేమ 68 నుండి 72% వరకు ఉండాలి.




3. మొలకెత్తుట – మష్రూమ్ మైసిలియంను సిద్ధం చేసిన పడకలలో విత్తే ప్రక్రియను సాధారణంగా స్పానింగ్ అంటారు. ట్రేలలో కంపోస్ట్‌ను వెదజల్లడం ద్వారా లేదా ట్రేలను నింపే ముందు కంపోస్ట్‌తో ధాన్యం స్పాన్‌ను కలపడం ద్వారా మనం రెండు విధాలుగా గుడ్లు పెట్టవచ్చు. మొలకెత్తడం పూర్తయిన తర్వాత మేము ట్రేలను వార్తాపత్రికతో కప్పి, తేమను నిర్వహించడానికి కొంత నీరు చల్లాలి.

4. కేసింగ్ – మేము మెత్తగా చూర్ణం చేసిన కుళ్ళిన ఆవు పేడను తోట మట్టితో కలిపితే, దీనిని కేసింగ్ మట్టి అంటారు. ఇందులో పిహెచ్ ఆల్కలీన్ వైపు ఉండాలి. కేసింగ్ మట్టిని బాగా క్రిమిరహితం చేయాలి మరియు హానికరమైన కీటకాలు, నెమటోడ్లు, తెగులు మొదలైన వాటిని నాశనం చేయగలదు. మట్టిని ఫార్మాలిన్ ద్రావణంతో చికిత్స చేయడం ద్వారా లేదా ఆవిరి చేయడం ద్వారా మనం క్రిమిరహితం చేయవచ్చు. కేసింగ్ మట్టికి చాలా గాలి అవసరం. స్ప్రెడ్ చేసిన తర్వాత ఉష్ణోగ్రతను 25డిగ్రీల ఫారెన్‌హీట్ వద్ద 72 గంటల పాటు నిర్వహించాలి.

5. పిన్నింగ్ – గదిలోని సిఓ2 కంటెంట్ 0.08% కంటే తక్కువగా ఉన్నప్పుడు పిన్ అభివృద్ధి చెందుతుంది. ప్రారంభంలో ఏర్పడే పుట్టగొడుగు రిజోమోర్ఫ్ ఏర్పడిన తర్వాత అభివృద్ధి చెందుతుంది. కొత్తగా ఏర్పడిన పుట్టగొడుగులు చాలా చిన్నవి. గదిలో ప్రవేశపెట్టడానికి తాజా గాలి యొక్క సమయం చాలా ముఖ్యం. కేసింగ్ యొక్క ఉపరితలంపై మైసిలియం కనిపించడం ప్రారంభించే వరకు గదిలోకి గాలి ప్రవేశించకుండా నిరోధించండి. పిన్ ఇనిషియల్ ఏర్పడటం ప్రారంభించినప్పుడు కేసింగ్‌కు నీరు పెట్టడం ఆపండి.

6. హార్వెస్టింగ్ – మేము పుట్టగొడుగులను "ఫ్లష్స్"గా కోస్తాము. మొదటి ఫ్లష్ 3 నుండి 5 రోజులలో కోయబడుతుంది మరియు 15 నుండి 20 కిలోల/మీ2 దిగుబడిని పొందుతుంది. రెండవ ఫ్లష్ 5 నుండి 7 రోజులలో కోయబడుతుంది మరియు 9 నుండి 11 కిలోల/మీ2 దిగుబడిని మొదటి ఫ్లష్ కంటే కొంచెం తక్కువగా పొందండి. మొత్తం 27 నుంచి 35 కిలోల దిగుబడి వస్తుంది.

చేతితో తయారైన పుట్టగొడుగులను తాజాగా నిల్వ చేసి తినవచ్చు. ■

సహనంతో వేచివుండే వారికి సకలం సమకూరుతాయి

# బాటిల్ వాటర్ వ్యాపారాన్ని 50 ఏళ్ళ క్రితమే గుర్తించిన చౌహాన్!

నీళ్లు కూడా కొని తాగాల్సి వస్తుందని 25 ఏళ్ల క్రితం ఎవరైనా అనుకున్నారా? అయితే ఇండియాలో వాటర్ బాటిల్ వ్యాపారం కోట్ల రూపాయల్లో ఉంటుందని 50 ఏళ్ల క్రితమే అంచనా వేసిన ఓ వ్యక్తి ఉన్నాడు. ప్రజలు పాలు, కూర గాయలు, ధాన్యాలు అమ్మడం ద్వారా డబ్బు సంపాదిస్తారు కానీ ఈ వ్యాపారవేత్త నీటిని అమ్మడం ద్వారా అపారమైన సంపదను సంపాదించాడు.




మనం మాట్లాడుతున్న వ్యక్తి బిస్లరీ యజమాని రమేష్ చౌహాన్, భారతదేశంలో బాటిల్ వాటర్ వ్యాపారానికి గుర్తింపు ఇచ్చింది ఇతనే, రమేష్ చౌహాన్ 1969 లో బిస్లరీ వ్యాపారం ప్రారంభించినప్పుడు, డబ్బుతో కొనుక్కుని భారతదేశంలో నీరు ఎవరు తాగుతారని ప్రజలు నవ్వుకునేవారు. అయితే ఇప్పుడు 50 ఏళ్ల తర్వాత ప్రతి వీధి, కూడలి, హోటల్లో బిస్లరీ బాటిల్స్ పెద్ద ఎత్తున అమ్ముడవుతున్నాయి, బిస్లరీ, దాని యజమాని రమేష్ చౌహాన్ విజయగాథ గురించి ఇప్పుడు చూద్దాం,

**బిస్లరీ వ్యాపారం కొనుగోలు**

బిస్లరీ ఇటాలియన్ బ్రాండ్, దీనిని చౌహాన్ కుటుంబా నికి చెందిన పార్లే 1969లో రూ.4 లక్షలకు కొనుగోలు చేసింది. చౌహాన్ కుటుంబం 54 సంవత్సరాల క్రితం బిస్లరీ వ్యాపారాన్ని కొనుగోలు చేసినప్పుడు, రమేష్ చౌహాన్ వయస్సు కేవలం 28 సంవత్సరాలు, 25 ఏళ్ల తర్వాత బిస్లరీ పూర్తిగా రమేష్ చౌహాన్ చేతుల్లోకి వచ్చింది. దీని తర్వాత బిస్లరీ బాటిల్ వాటర్ వ్యాపారం వేగంగా అభివృద్ధి చెందింది. ఇప్పుడు మినరల్ వాటర్ వ్యాపారంలో బిస్లరీ పెద్ద పేరు సాధించింది.

**52 ఏళ్ళ ప్రసిద్ధి**

భారతదేశంలో ప్యాకేజ్డ్ వాటర్ మార్కెట్ విలువ రూ. 20,000 కోట్ల కంటే ఎక్కువగా ఉంది, ఇందులో 60 శాతం అసంఘటితమైనది, అయితే వ్యవస్థీకృత మార్కెట్లో బిస్లరీ వాటా 32 శాతం, 52 సంవత్సరాల తన కెరీర్లో చౌహాన్ అనేక ముఖ్యమైన పదవులను నిర్వహించారు, వ్యాపారాన్ని వివిధ మార్గాల్లో విస్తరించారు.

ఇదిలా ఉండగా, రమేష్ చౌహాన్ తన కుమార్తె జయంతి చౌహాన్ ఈ వ్యాపారంపై ఆసక్తి చూపకపోవడంతో బిస్లరీ వ్యాపారాన్ని విక్రయించాలని భావించినట్లు వార్తలు వచ్చాయి. అయితే చివరి క్షణంలో జయంతి మనసు మార్చుకుని బిస్లరీ బాధ్యతలు చేపట్టింది. ఇప్పుడు బిస్లరీ వ్యాపారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు సన్నాహాలు మొదలుపెట్టారు.




బిస్లరీతో పాటు, రమేష్ చౌహాన్ థమ్సప్, గోల్డ్‌స్పాట్, సిట్రా, మాజా, లిమ్కా వంటి బ్రాండ్లను కూడా భారత మార్కెట్లో విడుదల చేశారు. 2016 లో వారు స్పైసీ, లిమోనాటా, ఫోంజో, పినాకోలాడా అనే 4 అద్భుతమైన రుచులలో ‘బిస్లెరీని ప్రారంభించారు. నేడు బిస్లరీకి దేశవ్యాప్తంగా 122 ప్లాంట్లు, 4500 డిస్ట్రిబ్యూటర్లు, 5000 డిస్ట్రిబ్యూషన్ ట్రక్కులు ఉన్నాయి. వీటితో కంపెనీ ప్రతిరోజూ 2 కోట్ల లీటర్ల నీటిని ప్రజలకు అందిస్తోంది.

(న్యూస్ 18 సౌజన్యంతో)

■

వేధింపు మితిమీరితే ఎంత చిన్న ప్రాణి అయినా తిరగబడుతుంది

# ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వ రాయితీలు

ఉద్యాన పంటలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉద్యాన రైతులకు అనేక రాయితీలు అందిస్తున్నది. అయితే, ఆ రాయితీలను గురించి తగిన అవగాహన లేకపోవడం వల్ల రైతులు ఆశించిన ప్రయోజనం పొందలేక పోతున్నారు. ఆ రాయితీల వివరాలు, నియమ నిబంధనల గురించి తెలుసుకుందాం.

ఒక రైతుకు 5 ఎకరాలకు మాత్రమే అత్యధికంగా రాయితీ ఇస్తారు. 5 ఎకరాలకు మించి భూమి ఉన్న పేదరైతు కూడా పథకానికి అర్హులే అయినప్పటికీ 5 ఎకరాలకు మాత్రమే రాయితీ వర్తిస్తుంది. దీనిని రెండేళ్ళ పాటు అందజేస్తుంది. రైతులు నాణ్యమైన మంచి గుర్తింపు ఉన్న నర్సరీల్లో మొక్కలను తెచ్చుకోవాలి. భూసార పరీక్షతో యాజమాన్య పద్ధతులు తెలుసుకొని తగినంత మోతాదులో ఎరువుల వాడకం చేపడితే మంచి లాభాలు ఆర్జించవచ్చు.

నీటి వసతి ఉండి బిందుసేద్యం ఉన్న రైతులు ఈ పథకానికి అర్హులు. రైతుకు అయ్యే ఖర్చులో 40 శాతం సబ్సిడీగా ఇస్తారు. అందులో 60 శాతం మొదటి ఏడాది. మిగిలిన 40 శాతం రెండో ఏడాది నేరుగా రైతుల ఖాతాకు జమ చేస్తారు. రెండో ఏడాది రాయితీ రావటానికి రైతులు నాటుకున్న మొక్కల్లో 80 శాతం బతికి ఉండాలి.

**సబ్సిడీ కోసం రైతులు అధికారులకు ఇవ్వాల్సిన ధ్రువపత్రాలు**

- దరఖాస్తుతో పాటు వీటిని సమర్పించాల్సి ఉంటుంది.
- రైతు పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్ కాపీ
- 1బీ నకలు లేటెస్ట్‌కాపీ
- ఆధార్ కార్డు జిరాక్స్
- బ్యాంకు ఖాతా పాస్ బుక్ కాపీ
- రైతు పాస్‌పోర్టు ఫొటో
- మొక్కలు కొనుగోలు చేసిన బిల్లు

**పూలతోటలకు..**

హైబ్రిడ్ కూరగాయలకు ఎకరాకు 9,600 రూపాయలు, పూలతోటలైన బంతి, చామంతి, మల్లె మొక్కలకు ఎకరాకు 8000 రూపాయలు చొప్పున రాయితీ అందించనున్నారు. ఉద్యానవనశాఖ అధికారులను సంప్రదించి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు. ■

**వివిధ పండ్ల మొక్కలకు ప్రభుత్వం అందించే రాయితీ మొత్తం వివరాలు**

| పంట | మొక్క మధ్య దూరం | ఎకరాకు ఎన్ని | మొదటి ఏడాది | రెండో ఏడాది | మొత్తం |
|---|---|---|---|---|---|
| మామిడి | 7.5–7.5మీ | 72 | 12,000/- | 8,000/- | 20,000/- |
| మామిడి | 5–5 మీ | 160 | 19,200/- | 12,800/- | 32,000/- |
| మామిడి | 3–2 మీ | 670 | 28,800/- | 19,200/- | 48,000/- |
| జామ | 3–3 మీ | 44 | 19,200/- | 12,800/- | 32,000/- |
| బత్తాయి | 6–6మీ | 111 | 12,000/- | 8,000/- | 20,000/- |
| సపోటా | 5–5 మీ | 160 | 14,400/- | 9,600/- | 24,000/- |
| అరటి | 1.8–1.8 మీ | 123 | 16,800/- | 11,200/- | 28,000/- |
| బొప్పాయి | 1.8–1.8 మీ | 1,235 | 7,200/- | 4,800/- | 12,000/- |
| సీతాఫలం | 4–4 మీ | 250 | 7,200/- | 4,800/- | 12,000/- |
| ఉసిరి | 6–6 మీ | 111 | 7,200 | 4,800/- | 12,000/- |

స్వభావం రాజు, అహంకారం బానిసఅయితే అన్నిటా గెలుపే, అంతటా ఆనందమే

# ఒకే ఒక కషాయంతో కాళ్ళ వాపులు మాయం!

**కాళ్ల** వాపులు. చాలా ఎక్కువ మంది ఎదుర్కొనే సమస్య ఇది. శరీరంలో నీటి శాతం పెరిగిపోయినప్పుడు ఇలా జరుగుతుంది. అయితే..ఎక్కువ సేపు ప్రయాణం చేసినా, ఒకే చోట కూర్చున్నా ఇలా కాళ్ల వాపులు వస్తాయి. దీన్నే ఎడిమా అని పిలుస్తారు. ఇది మరీ ప్రమాదకరం కాకపోయినప్పటికీ... జాగ్రత్తపడడం మాత్రం తప్పనిసరి. ఎక్కువ రోజుల పాటు ఇలాగే కొనసాగితే ఇబ్బందులు తప్పవు. వెంటనే వైద్యుల సలహా తీసుకుని అందుకు తగ్గట్టుగా మెడికేషన్ ఫాలో అవడం బెటర్.

ఇదే సమయంలో పూర్తిగా మందులపైనే ఆధారపడ కుండా కొన్ని ఇంటి చిట్కాలతో కూడా ఈ సమస్యను తగ్గించుకోవచ్చు. అలాంటి చిట్కా గురించే డాక్టర్ వివరించారు. కేవలం ఓ డికాక్షన్ చేసుకుని తాగితే చాలు. పేరుకుపోతుంది. ఇదొక్కటే కాదు. రక్తనాళాల్లో ఏదైనా సమస్య ఉన్నా ఇలాగే జరుగుతుంది. ఇంకొందరిలో హార్మోన్ సమస్యలు ఉన్నప్పుడు కాళ్ల వాపులు వస్తుంటాయి. కారణాలేవైనా సరే తరచూ ఇలా జరుగుతోందంటే వైద్య సలహాలు తీసుకోవడం మంచిది. దీంతోపాటు ఇప్పుడు చెప్పే చిట్కా కూడా ఫాలో అయితే సులువుగా సమస్యను తగ్గించుకోవచ్చు

మూడే మూడు పదార్థాలు చాలు. చాలా సులువుగా కాళ్ల వాపులు తగ్గించవచ్చు అని చెబుతున్నారు డాక్టర్ ఖత్రీ. ఈ డికాక్షన్ తయారు చేయడానికి తిప్పతీగ పొడి, కరక్కాయ పొడి, అల్లం పొడి అవసరం అవుతాయి. వీటన్నింటిలోనూ ఔషధ గుణాలున్నాయి. తిప్పతీగను ఎన్నో ఏళ్లుగా వాడుతున్నారు. ముఖ్యంగా ఆయుర్వేదంలో దీనికి ఎంతో ప్రత్యేకత ఉంది. రోగనిరోధక శక్తిని పెంచడంలో, చర్మ సమస్యలను





చాలా సులభంగా కాళ్ల వాపులు తగ్గించుకోవచ్చని చెప్పారు డాక్టర్ ఖత్రీ. ఓ మూడు పదార్థాలతో తయారు చేసుకోగలిగితే ఈ డ్రింక్ వల్ల ఎన్నో లాభాలున్నాయని వివరించారు.

శరీరంలో నీటి శాతం ఎక్కువైతే అవి కండరాల్లోకి చేరుకుంటాయి. దీని వల్లే వాపులు వస్తాయి. అయితే... ఎక్కువగా కాళ్లలో ఈ వాపులు కనిపిస్తాయి. కాస్త వయసు మీద పడిన ప్రతి వారిలోనూ కనిపించే సమస్యే ఇది. కొంత మందికి మరీ ఎక్కువగా వాపులు వస్తుంటాయి. కాళ్లపైన వేలితో నొక్కినప్పుడు గుంటలు పడినట్టుగా అవుతుంది. అంటే అదంతా నీరే. అవయవాల పనితీరు సరిగ్గా లేక పోయినా శరీరంలో నీరంతా ఇలా ఒక్క చోటుకు వచ్చి తగ్గించడంలో ఇది చాలా బాగా పని చేస్తుంది. ఇక కరక్కాయతోనూ ఎన్నో ప్రయోజనాలున్నాయి. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్స్ బాడీలో ఉన్న మురికిని వదిలిస్తాయి. అల్లంలోనూ యాంటీ ఆక్సిడెంట్స్, యాంటీ ఇన్ ఫ్లమేషన్ గుణాలు అధికంగా ఉంటాయి. ఇది కూడా టాక్సిన్స్‌ని బయటకు పంపుతుంది. ఈ మూడు కలిపి తీసుకంటే ప్రయోజనాలు రెట్టింపు అవుతాయి.

**తయారీ విధానం**

డాక్టర్ ఖత్రీ చెప్పిన ప్రకారం...అర టీ స్పూన్ తిప్పతీగ పొడి, అర టీస్పూన్ కరక్కాయ పొడి, అర స్పూన్ అల్లం పొడి తీసుకోవాలి. నాలుగు కప్పుల నీళ్లు తీసుకుని అందులో

**అనుకున్నది నెరవేరనప్పుడు మరింత తపన,మరింత కృషి, చెదరని చిరునవ్వు మరింతగా అవసరం**

ఈ పొడులు కలపాలి. రాత్రంతా అలాగే వాటిని ఉంచాలి. మరుసటి రోజు ఉదయమే ఈ నీళ్లను బాగా మరిగించాలి. అయితే..ఇలా మరిగించినప్పుడు నీళ్లు ఓ కప్పు వరకూ వచ్చేలా చూసుకోవాలి. అంటే..నాలుగు కప్పుల నీళ్లు కాస్తా ఓ కప్పులోకి పట్టేంతగా మరగాలి. అలా చేస్తేనే మూడు పొడులలో ఉన్న ఔషధ గుణాలు నీళ్లలోకి వస్తాయని వివరించారు డాక్టర్ ఖత్రీ. ఇలా బాగా మరిగిన తరవాత కాస్త వేడి చల్లారనివ్వాలి. గోరువెచ్చగా ఉన్నప్పుడు తీసుకుంటే ఫలితాలు బాగుంటాయి. ఇలా రెగ్యులర్‌గా తీసుకుంటే కాళ్ల వాపులు వాటంతట అవే తగ్గిపోతాయి.

**జాగ్రత్తలు**

అయితే..ఈ డికాక్షన్ తీసుకున్న సమయంలో కొన్ని జాగ్రత్తలు పాటించాలి. డైట్ విషయంలోనూ జాగ్రత్తగా ఉండాలి. టమాట పొరపాటున కూడా తీసుకోకూడదు. దీంతో పాటు మసాలాలు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాల జోలికి వెళ్లకూడదు. ఫర్మెంట్ ఫుడ్స్..అంటే ఇడ్లీలు, దోశలు లాంటివి తీసుకోకపోవడం మంచిది. అంతే కాదు. మరీ అతి చల్లని పదార్థాలు తినకూడదు. ప్యాక్డ్ ఫుడ్స్‌కి ఎక్స్ పైరీ డేట్ ఉంటుంది. కచ్చితంగా ఆ తేదీని గమనించాలి. ఎక్స్‌పైరీ డేట్ అయిపోయిన ఫుడ్‌ని అసలు ముట్టకూడదు. వీలైనంత వరకూ లైట్ ఫుడ్ తీసుకోవాలి. అంటే...సులువుగా అరిగే పదార్థాలు మాత్రమే తినాలి.

**ఇంకొన్ని చిట్కాలు**

కాళ్ల వాపులు తరచూ వస్తుంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. కూర్చున్నప్పుడు లేదా నిద్రపోయినప్పుడు కాస్త పైకి పెట్టుకోవాలి. ఇలా చేయడం వల్ల నీరు పేరుకుపోవడం తగ్గుతుంది. మరో ముఖ్యమైన విషయం సాల్ట్ కంటెంట్ తగ్గించాలి. ఉప్పులో ఉండే సోడియం పెరిగిపోతే ఇలాగే నీరంతా అలాగే ఉండిపోతుంది. యూరిన్, చెమట ద్వారా బయటకు రావాల్సిన నీరు కూడా నిలిచిపోతుంది. ఫలితంగా కాళ్ల వాపులు వచ్చే అవకాశాలుంటాయి. వాకింగ్, జాగింగ్ లాంటివి చేయడం వల్ల కొంతవరకూ ఈ సమస్య తగ్గుతుంది.

(తెలుగు సమయం సౌజన్యంతో )

■

## రైతులకు 4 శాతం వడ్డీకే రూ. 3 లక్షల కేంద్ర రుణం

**కి**సాన్ క్రెడిట్ కార్డ్ స్కీమ్ రైతులకు ఒక జీవనాడిగా మారిందని, ఈ పథకం ద్వారా రైతులు తక్కువ వడ్డీకే రుణాలు తీసుకుని, తమ వ్యవసాయ కార్యకలాపాలను సజావుగా నిర్వహించుకుంటున్నటు కేంద్ర ఆర్థికమంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఈ రుణాలు రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల వంటి వ్యవసాయ అవసరాలను తీర్చుకునేందుకు ఉపయోగపడు తున్నట్లు చెప్పారు.

**సకాలంలో చెల్లిస్తే..**

రైతులు సకాలంలో ఈ రుణాన్ని తిరిగి చెల్లిస్తే, కేవలం 4 శాతం వడ్డీ రేటుతో రూ. 3 లక్షల వరకు రుణం పొంద వచ్చని తెలిపారు. అంతేకాకుండా, సకాలంలో రుణ చెల్లింపునకు 3 శాతం అదనపు ప్రోత్సాహక వడ్డీ రాయితీ కూడా అందించబడుతుందన్నారు. దీని ఫలితంగా అన్నదాతలకు వడ్డీ రేటు 4 శాతానికి తగ్గుతుంది. ఈ నేపథ్యంలో ప్రతి రూ.లక్ష రుణంపై రైతులు సంవత్సరానికి రూ. 9,000 వడ్డీని ఆదా చేసుకుంటారు.

**రుణ పరిమితి 5 లక్షలకు పెంపు**

ఈ స్కీమ్ ద్వారా కేంద్ర ప్రభుత్వం సబ్సిడీతో కూడిన కేసీసీ రుణ పరిమితిని రూ. 3 లక్షల నుంచి రూ. 5లక్షలకు పెంచింది. దీంతో దాదాపు 7.7 కోట్ల రైతులు ప్రయోజనం పొందుతున్నారు. ఈ విధానం రైతులకు వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుకు, ఇతర అవసరాలకు సరసమైన ధరలో రుణాన్ని అందుబాటులోకి తెచ్చారు.

సమయానికి రుణాలను తిరిగి చెల్లించిన రైతన్నలకు అదనంగా 3% వడ్డీ సబ్సిడీ కల్పించబడుతుంది. రుణ పరిమితిలో పంటల రుణాలకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. మిగిలిన మొత్తం ద్వారా పశు పోషణ, మత్స్య కార్యక్రమాల వంటి అనుబంధ కార్యకలాపాలకు రుణాలు అందిస్తారు.

■

# ప్రసవానికి ముందటి శరీర పటుత్వం కోసం...

**మా**తృత్వం కచ్చితంగామధురమైనదే! అయితే పొట్ట మీద చారలు, కటి కండరాలు పటుత్వం కోల్పోవడం లాంటి ప్రసవానంతర క్రియాత్మక మార్పులు తల్లులను మాతృత్వ మధురిమలకు దూరం చేస్తాయి. తల్లులను ఆత్మన్యూనతకు లోను చేసే ఈ అసౌకర్యాలను కొత్త చికిత్సలతో సరిదిద్దుకునే వీలుందని అంటున్నారు వైద్యులు.

సాధారణంగా గర్భధారణతో విడుదలయ్యే హార్మోన్ల వల్ల శరీరంలోని ప్రతి కణం ప్రభావితమవుతుంది. హార్మోన్లలో చోటుచేసుకునే మార్పులతో పాటు పెరిగే బిడ్డకు సరిపడా జాగాను సమకూర్చడం కోసమే మన కణాలు మార్పులకు లోనవుతాయి. అలాగే ప్రసవ సమయంలో కండరాలు వాటి పూర్తి సామర్థ్యం మేరకు సాగుతాయి. కానీ ప్రసవం తర్వాత పొత్తికడుపు, కటి ప్రదేశంలోని కండరాలు అంతే సమానంగా సంకోచించలేవు. దాంతో ప్రసవానంతరం మహిళ శరీరం మునుపటి పటుత్వాన్ని పూర్తిగా తిరిగి పొందలేకపోతుంది. అయినప్పటికీ ప్రసవంతో చోటుచేసుకున్న ఈ భౌతిక మార్పులతో పాటు కొన్ని క్రియాత్మక మార్పులను కూడా సరిదిద్దగలిగే వీలుంది. ప్రసవానంతర వ్యాయామాలతో కండరాల పటుత్వాన్ని కొంత మేరకు పెంచుకోవచ్చు. అవి సత్ఫలితాన్నివ్వని సందర్భాల్లో, కొత్తగా తలెత్తే అసౌకర్యాలకు అడ్డుకట్ట వేయడం కోసం, అందుబాటులో ఉన్న చికిత్సలను ఆశ్రయించాలి.

**కొత్త చికిత్సలతో...**

పిల్లలను కన్న తల్లులు సమతులాహారం తీసుకుంటూ, వ్యాయామాలు చేయగలిగితే కొంత మేరకు కటి కండరాలు పటుత్వాన్ని పొందుతాయి. ఈ జాగ్రత్తలు పాటించినా పరిస్థితి మెరుగుపడని సందర్భాల్లో, క్లిష్టమైన ప్రసవాల మూలంగా వ్యాయామాలు చేయలేని సందర్భాల్లో సదరు మహిళలు ఆశ్రయించదగిన చికిత్సలు కొన్ని అందుబాటులో ఉన్నాయి. సాధారణ ప్రసవం లేదా సిజేరియన్‌తో పిల్లలను కన్న తల్లులు, పిల్లలను కన్న ఆరు నుంచి ఎనిమిది వారాలకు ఈ చికిత్సలను ఆశ్రయించవచ్చు.

హైఫెమ్ ఛెయిర్ : విద్యుత్తుతో పని చేసే ఈ ఛెయిర్‌లో అరగంట పాటు కూర్చున్నప్పుడు 11 వేల కండరాలు సంకోచానికి గురవుతాయి. కండరాలు ప్రేరేపితమై, కొల్లాజెన్ ఉత్పత్తి ఊపందుకుంటుంది. దాంతో కండరాలు పటుత్వాన్ని సంతరించుకుంటాయి. ఈ చికిత్సను ఆరు విడతలుగా వారానికి రెండుసార్లు చొప్పున తీసుకోవాల్సి ఉంటుంది.

**లేజర్ చికిత్స :** సాధారణ ప్రసవంతో యోని వదులుగా మారినప్పుడు, బిగుతును పెంచడం కోసం ఈ చికిత్స ఉపయోగపడుతుంది. ఈ ఐదు నిమిషాల చికిత్స కోసం ఏ పనులూ ఆపుకోవలసిన అవసరం లేదు. ఉద్యోగినులు కూడా నిరభ్యంతరంగా ఈ చికిత్సను ఆశ్రయించవచ్చు. ఈ చికిత్సను నాలుగు విడతలుగా నెలకొకసారి చొప్పున తీసుకోవాల్సి ఉంటుంది.

**స్ట్రెచ్ మార్క్స్ :** కొందరికి పొట్ట మీద ఏర్పడే చారలు ప్రసవానంతరం క్రమేపీ తగ్గిపోతాయి. కొందరికి అలాగే ఉండిపోయి, ఎబ్బెట్టుగా కనిపిస్తూ ఉంటాయి. ఇలాంటి చారలను కూడా లేజర్ చికిత్సతో 90 శాతం మేరకు తగ్గించే

*ప్రసవం తర్వాత శరీరం బరువు పెరుగుతుంది. రూపం కోల్పోతుంది. 'ఇవన్నీ సహజసిద్ధ మార్పులే కాబట్టి వాటితో సర్దుకుపోవలసిందే ... అనే ఆలోచనలు మహిళల మనసుల్లో నాటుకుపోయి ఉంటాయి. కానీ నిజానికి అలా సర్దుకుపోవలసిన అవసరం లేదు. ప్రసవం మునుపటి పటుత్వాన్ని పొందడం కోసం అందుబాటులో ఉన్న చికిత్సలను ఆశ్రయించడం అవసరం. వీటితో సౌందర్య పరంగా, క్రియాత్మకంగా పూర్వపు పటుత్వాన్ని సాధించి కోల్పోయిన ఆత్మవిశ్వాసాన్ని తిరగి పొందగలిగే వీలుంది.*

*– డా॥ డి.జయలక్ష్మి, కాస్మటిక్ గైనకాలజిస్ట్,*
*రోహన్ హాస్పిటల్, హైదరాబాద్*

కోపమెందుకు? నీవు చెప్పేది సరైనదైతే కోపంతో పనిలేదు, సరైనది కాకుంటే కోపించే అర్హత లేదు

# ప్రసవం కోసం ఆసుపత్రికి వెళ్లేటప్పుడు ....

**వై**ద్యులు సూచించిన ప్రకారం ప్రసవ తేదీ సమీపిస్తుందనగానే ఒక బ్యాగ్‌ను సిద్ధం చేసుకోవాలి. ఆ బ్యాగ్ తల్లీ బిడ్డలకు అవసరమయ్యే వస్తువులు, దుస్తులు తదితరాలను పొందికగా సర్దడానికి అనువుగా ఉండాలి.

- ♦ వైద్యుల సూచనలతో ఇప్పటి వరకు వాడిన మందుల చీటీలు, ఇతరత్రా చేయించుకున్న వైద్య పరీక్షల రిపోర్టులు, ఎక్స్‌రేలు, పుట్టబోయే బిడ్డ ఆరోగ్యానికి సంబంధించి కీలక సమాచారాన్ని తెలిపే పత్రాలను ఒక ఫైల్‌లో ఉంచాలి. దీనితోపాటు ఆధార్ కార్డ్, ఇన్సూరెన్స్ కార్డులను బ్యాగ్‌లో పెట్టాలి.
- ♦ ప్రసవం అయిన తరవాత ధరించేందుకు వదులుగా ఉండే నూలు దుస్తులు, పొడవాటి చున్నీలు, బాలింతల కోసం ప్రత్యేకించిన బట్టలు, తువాళ్లు, లోదుస్తులు, మెటర్నిటీ ప్యాడ్స్ సర్దుకోవాలి.
- ♦ బిడ్డకు పాలిచ్చేటప్పుడు ఒడిలో పెట్టుకోవడానికి మెత్తటి దిండును తీసుకెళ్లాలి.
- ♦ రోజువారీగా అవసరమయ్యే టూత్‌బ్రష్, పేస్ట్, సబ్బులు, షాంపూలు, దువ్వెన, లిప్ బామ్, మసాజ్ ఆయిల్ తదితరాలను ఒక బాక్స్‌లో పెట్టుకోవాలి.
- ♦ ప్రసవం తరవాత నడవమని వైద్యులు చెబుతుంటారు. మెత్తగా సౌకర్యవంతంగా ఉండే చెప్పుల జతను తీసుకెళ్లాలి.
- ♦ పుట్టిన బిడ్డకు డైపర్లు అవసరమవుతాయి. వీటితోపాటు పిల్లలకు మాత్రమే ప్రత్యేకించిన ర్యాష్ క్రీమ్‌ను కూడా బ్యాగ్‌లో పెట్టుకోవాలి.
- ♦ అలాగే బిడ్డ కోసం రెండు జతల దుస్తులు, తలకు క్యాప్, కాళ్లకు సాక్స్, చేతులకు మిటెన్స్, బేబీ వైప్స్ లేదా మెత్తని టవల్స్, బేబీ క్యారియర్ లేదా స్లీపింగ్ బ్యాగ్ తీసుకెళ్లాలి.

■

వీలుంది. ఈ చికిత్సను నెలకొకసారి చొప్పున ఆరు విడతల్లో చేయించుకోవాలి.

**ప్రయోజనాలున్నాయి**

**హైఫెమ్ ఛెయిర్, లేజర్ సర్జరీలతో పొందే ప్రయోజనాలు ఇవే!**

**ఇన్‌ఫెక్షన్లు :** ప్రసవానంతర ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి

**యోని పొడిబారడం :** లేజర్ చికిత్సతో ఈ సమస్య తొలగిపోతుంది

**లైంగిక తృప్తి:** యోని వదులవడంతో తలెత్తే అసంతృప్తి సమస్యలు తొలగిపోతాయి.

**40 ఏళ్ల మహిళల్లో...**

ఈ వయసు మహిళల్లో మూత్రాశయ కండరాలు బలహీనపడడం వల్ల మూత్రం మీద పట్టు తగ్గుతుంది. తరచూ మూత్ర విసర్జన చేయవలసి రావడం, మూత్రాన్ని ఆపుకోలేకపోవడం, దగ్గినా, తుమ్మినా మూత్రం లీక్ అవుతూ ఉండడం లాంటి సమస్యలను ఎదుర్కొంటూ ఉంటారు. ఈ కోవకు చెందిన మహిళలు కెగెల్ వ్యాయామాలు, లేజర్ చికిత్సలతో సమస్యను సరిదిద్దుకోవచ్చు. అలాగే మధుమేహులైన మహిళలు కూడా మూత్రాన్ని ఏమాత్రం ఆపుకోలేరు. వీళ్లు కూడా లేజర్ చికిత్సను ఆశ్రయించవచ్చు.

ఈ చికిత్సల తర్వాత వైద్యులు సూచించిన వ్యాయామాలు చేస్తూ, సమతులాహారం తీసుకున్నంత కాలం సమస్యలు అదుపులో ఉంటాయి. అలాగే ఏడాదికోసారి పరీక్షలు చేసుకుంటూ కండరాల పటుత్వాన్ని పరీక్షించుకుంటూ ఉండాలి. కండరాల క్రియత్మాక ప్రభావం తగ్గిన సందర్భాల్లో కొందరు మహిళలకు ఇవే చికిత్సలు మళ్లీ అవసరం పడొచ్చు.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)

■

గతం దు:ఖమైతే , భవిష్యత్ భయం; అందుకే ఈ క్షణమే భద్రం, నిర్భయం, ఆనందం

# ఏపీ రైతులకు సొసైటీలలో ఉచితంగా 23 రకాల సేవలు !

**ఆం**ధ్రప్రదేశ్‌లోని రైతులకు అద్భుత అవకాశం. రైతులకు స్వల్పకాలిక రుణాలు, ఆర్థిక సహకారం అందించేందుకు ఉద్దేశించిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలలో (సొసైటీలు) కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా పలు సేవలు అందిస్తున్నారు. రీఛార్జులు, టికెట్ల బుకింగ్ దగ్గర నుంచి పాన్ కార్డు సేవల వరకూ మొత్తంగా 23 రకాల సేవలు కామన్ సర్వీస్ సెంటర్లలో అందిస్తున్నారు. కొన్ని సేవలకు నామమాత్రపు రుసుం వసూలు చేస్తుండగా.. చాలా సేవలు ఉచితంగా అందిస్తుండటం విశేషం. అయితే వీటిపై అవగాహన లేక స్పందన తక్కువగా ఉందని అధికారులు చెప్తున్నారు.

ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (సొసైటీలు) గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు వ్యవసాయ రుణాలను, ఆర్థిక సేవలను అందించేందుకు ఏర్పాటు చేశారు. ఈ సంఘాలు రైతులకు పంట రుణాలతో పాటుగా పంటల మార్కెటింగ్, ఇతర వ్యవసాయ ఉత్పత్తుల పంపిణీలో సహాయపడుతుంటాయి. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలలో కామన్ సర్వీస్ సెంటర్‌లను కూడా నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఈ విధానం అమల్లో ఉంది. ఈ సీఎస్‌సీ సెంటర్ల ద్వారా అనేక సేవలు పొందవచ్చు. కరెంట్ బిల్లులు, బస్సు, రైలు టికెట్ల రిజర్వేషన్లు, మొబైల్ ఫోన్, డీటీహెచ్ రీఛార్జులు చేసుకోవచ్చు. ఈ సేవలకు కొన్నిచోట్ల నామమాత్రం రుసుం వసూలు చేస్తుండగా.. కొన్నిచోట్ల ఉచితంగా అందిస్తుండటం విశేషం. అయితే వీటిపై అవగాహన లేక రైతులు ఈ సేవలను ఉపయోగించు కోవటం లేదని అధికారులు చెప్తున్నారు.

ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలలోని కామన్ సర్వీస్ సెంటర్లలో పాన్‌కార్డు సేవలు, ఇన్సూరెన్స్ రెన్యువల్, రైలు టికెట్ల బుకింగ్, విమానం, బస్సు టికెట్ల రిజర్వేషన్, రీఛార్జులు, కరెంట్ బిల్లుల చెల్లింపు వంటి సేవలు అందిస్తున్నారు. మొత్తంగా ఇలా 23 రకాల సేవలు అందిస్తున్నట్లు అధికారులు చెప్తున్నారు.

సీఎస్‌సీ సేవలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని.. ప్రస్తుతానికి ఉచితంగానే సేవలు అందిస్తున్నట్లు అధికారులు చెప్తున్నారు. గ్రామీణ ప్రాంతాల రైతులు ఈ సేవలను ఉపయోగించుకోవాలని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల అధికారులు చెప్తున్నారు. ఈ సేవలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు

■

## పాలకు కనీస మద్దతు ధర ప్రకటించిన హిమాచల్‌ప్రదేశ్

**హి**మాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం పశుపోషణ ద్వారా గ్రామీణ రైతుల ఆదాయ మార్గాలను పెంపొందించే దిశగా విప్లవాత్మక చర్యలు చేపట్టింది. దేశ చరిత్రలోనే తొలిసారిగా ఆవు, గేదె పాలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ప్రకటించి, పాడి రైతులకు ఆర్థిక భరోసా కల్పించింది. ఈ నిర్ణయం రాష్ట్రంలోని వేలాది మంది పశుపోషకులకు గొప్ప ఊరటనిస్తూ, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు దోహదపడనుంది.

ప్రభుత్వ అధికారిక లెక్కల ప్రకారం, రాష్ట్రవ్యాప్తంగా 38,400 మంది రైతుల నుంచి రోజూ 2.25 లక్షల లీటర్ల ఆవు పాలను, నాణ్యతను బట్టి లీటరుకు రూ. 51 చొప్పున సేకరిస్తున్నారు. అదేవిధంగా, 1,482 మంది రైతుల నుంచి 7,800 లీటర్ల గేదె పాలను లీటరుకు రూ. 61 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. మేక పాలకు లీటరుకు రూ. 70 ధరతో సేకరణకు పైలట్ ప్రాజెక్టును కూడా ప్రారంభించడం గమనార్హం.

కోళ్ల పెంపకాన్ని ప్రోత్సహించే 'హిమ్ పౌల్ట్రీ పథకం' కింద 6 లక్షలకు పైగా కోడిపిల్లలను పంపిణీ చేసి, వాణిజ్య యూనిట్ల ఏర్పాటుకు రూ. 6.13 కోట్లు కేటాయించారు.

■

# నేల ఆరోగ్యం - ఉత్పాదకత పెంపుదల

ఆరోగ్యంగా ఉన్న నేలకు ప్రతికూల పరిస్థితులను తట్టుకునే బలం ఉంటుంది
నేల ఆరోగ్యంగా ఉండాలంటే, అందులో తగినంత సేంద్రియ పదార్థం ఉండాలి

## చేపట్టే పనులు




NABARD

RNI Regd.No: TELTEL/2003/16365 MAHILA SADHIKARATHA Postal Regd No: HD/1064/2024-26

*Publication Date:01-07-2025* Posting at BPC-1V Patrika Channel, Nampally, Hyderabad-500001 *Posting Date: 05/07-06-2025*

# ఎఫ్ పి ఓ ల వార్షిక మహాసభల దృశ్యాలు !



నల్లమాడ



కనగానిపల్లి



తాడిపత్రి



పెద్దవడగూరు



నందీశ్వర



గోరంట్లపల్లిలో అంతర్జాతీయ యోగ దినోత్సవ ప్రతిజ్ఞ



భూత్పూర్ నైపుణ్య శిక్షణ కేంద్రంలో శ్రీ సి ఎస్

To ADDRESS



వినుకొండలో సామాజిక నీటిశుద్ధి కేంద్రం ప్రారంభం

బట్వాడా కాకపోతే దయచేసి ఈ చిరునామాకు తిప్పిపంపండి

ఎడిటర్, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, డ్రీమ్ వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089